ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

శుక్రవారం 17 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 30 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## న్యూజిలాండ్‌లో భూకంపం

### సునామీ హెచ్చరికలు జారీ




న్యూజిలాండ్‌లోని దక్షిణ ద్వీపంలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.3గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు తక్షణమే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని హెచ్చరించారు.
- న్యూఢిల్లీ, (సింగిడి)

2



సముద్రంలో పడవలు మునక..

## 500 మంది మృతి!

మయన్మార్ మైనార్టీలైన రోహింగ్యాలు ప్రయాణిస్తున్న రెండు పడవలు బంగాళాఖాతంలో మునిగిపోయాయి. ఈ ప్రమాదంలో 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ వసల సంస్థ సంయుక్తంగా ప్రకటించాయి. - న్యూఢిల్లీ, (సింగిడి)

2

## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### బిజినెస్ జాబితాను విడుదల చేసిన సెక్రటరీ జనరల్



పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. - న్యూఢిల్లీ, జులై 16(సింగిడి)

2

## సీఎంతో టిజి 20 లీగ్ విజేతల భేటీ

### విజేతలకు చెక్కులు అందచేసిన రేవంత్ రెడ్డి



టీజీ20 లీగ్ విజేతలైన హైదరాబాద్ ఈ–ఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించిన సీఎం, జట్టు సభ్యులకు విజేతల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.

హైదరాబాద్, జూలై 16 (సింగిడి)

2



## గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం


### నీటిని మళ్లించి జిల్లా రైతాంగాన్ని ఆదుకుంటాం

- ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే కెసిఆర్ డబ్బులు వృధా
- సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు
- ఖజనాపై భారం మోపారన్న డిప్యూటి సిఎం భట్టి

గోదావరిలో ప్రవహిస్తున్న జలాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి జలాలను మళ్లించడం ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం, జూలై16 (సింగిడి):

2



## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం

- కాంగ్రెస్‌పై రాంచందర్ రావు ఫైర్
- సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో ఘటన
- ఇస్లామిక్ సూక్తులు నేర్చుకోవాలంటూ హిందూ విద్యార్థికి హోంవర్క్
- షాక్‌కు గురైన తల్లిదండ్రులు
- స్కూలు గుర్తింపు రద్దు చేయాలన్న రాంచందర్ రావు

2

## మేం వచ్చాక హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం

బండి సంజయ్



## మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్

### రానున్న అదనపు కోచ్‌లు

- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు హెచ్ఎంఆర్ఎల్ కీలక నిర్ణయం
- రద్దీ స్టేషన్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి

2

# అమ్మవారి అలక... మెప్మాపై కినుక!

## టేబుల్‌పైనే ఆగిన ఆ ఫైల్

- సీఎం సానుకూల సంకేతాలు.... ప్రిన్సిపల్ సెక్రటరీ వద్దే పెండింగ్
- నిర్ణయం సిద్ధమైతే... ఆదేశాలకు అడ్డెవరు?... కొంటెతనం ఎవరిది?

**రాజు ఒప్పకున్నా... రాజభటుడు ఒప్పకోకపోతే పని జరగదంటారు. పంట పండినా గోదాముకి చేరకపోతే రైతుకు ప్రయోజనం ఉండదన్నట్లుగా మెప్మా ఉద్యోగుల పరిస్థితి కూడా అలాంటిదేనని ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సానుకూలంగా ఉందని... ముఖ్యమంత్రి స్వయంగా స్పందించారని... విలీనంపై అభ్యంతరం లేదని చెబుతున్న వేళ... సంబంధిత ఫైల్ మాత్రం రెండు నెలలుగా ఒకే టేబుల్‌పై ఆగిపోవడం వెనుక అసలు " కారణమేంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నిర్ణయం ముందుకెళ్లాలనుకుంటే... పరిపాలనా స్థాయిలో ఎందుకు నిలిచిపోయిందనే సందేహం వ్యక్తమవుతోంది. ఆషాఢ మాస జాతరల వేళ 'కొంటెతనం ఎవరిది' అని ఆ విభాగం ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.**
(స్టేట్ బ్యూరో - సింగిడి)



**మెప్మా–సెర్ప్ విలీనంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే సానుకూల వైఖరి వ్యక్తం చేసినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఇటీవల వనపర్తి జిల్లా పర్యటనలో కూడా సంబంధిత ఫైల్ ఎక్కడ ఉందని స్వయంగా ఆరా తీసినట్లు పేర్కొంటున్నారు. అంటే ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాలన్న ఉద్దేశం ఉందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఉద్యోగులు అంటున్నారు. అయితే, రాజకీయ సంకల్పం కనిపిస్తున్న చోట... పరిపాలనా చర్యలు ఎందుకు కనిపించడం లేదనేదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.**

### రెండు నెలలుగా ఒకే టేబుల్‌పైనేనా...?

ఉద్యోగుల సమాచారం ప్రకారం... మెప్మా విలీనానికి సంబంధించిన ఫైల్ ప్రస్తుతం ప్రిన్సిపల్ సెక్రటరీ, MA&UD శ్రీదేవి వద్ద గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉంది. ఫైల్ అక్కడే నిలిచిపోవడంతో వేలాది మంది ఉద్యోగుల భవిష్యత్తు కూడా నిరీక్షణలో పడిందని వారు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించినా... పరిపాలనా ప్రక్రియ ముందుకు సాగకపోతే నిర్ణయాలు ఎలా అమల్లోకి వస్తాయని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

2

### అధికారి టేబుల్‌పై ఆగిన నిర్ణయం...?

ఉద్యోగుల వాదన ప్రకారం... ఇక్కడ సమస్య ప్రభుత్వ విధానంలో కాదని, అమలు ప్రక్రియలోనే ఉందని చెబుతున్నారు. ముఖ్యమంత్రి స్పందించిన తర్వాత కూడా ఫైల్ ముందుకు వెళ్లకపోవడం... వ్యవస్థలో ఎక్కడో ఒకచోట నిర్ణయ ప్రక్రియ నిలిచిపోయిందనే అనుమానాలకు తావిస్తోంది. ఒక అధికారి టేబుల్‌పై ఫైల్ నిలిచిపోతే... వేలాది కుటుంబాల ఆశలు కూడా అదే టేబుల్ పైనే ఆగిపోవాలా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ముందుకెళ్లాలని భావిస్తే... పరిపాలన ఎందుకు వెనక్కి లాగుతోంది? నిర్ణయం సిద్ధంగా ఉంటే ఉత్తర్వులు ఎందుకు రావడం లేదు? ఫైల్ ఒక టేబుల్‌పై ఆగిపోతే... వేలాది మంది ఉద్యోగుల జీవితాలు కూడా అక్కడే నిలిచిపోవాలా? ఇప్పుడు మెప్మా ఉద్యోగులు ఎదురు చూస్తున్నది మరో హామీ కాదు... పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు కదలిక మాత్రమే.



## ఓట్లు వేయలేదనే కక్ష

### సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు: బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి
- సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు
- అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు.

ఖమ్మం, జూలై 16 (సింగిడి)

2



2

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

### ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ
- ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.

హైదరాబాద్, జులై 16 (సింగిడి)

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి

### 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

దేశంలో జగన్నాథ రథయాత్రకు

### ఎంతో ప్రత్యేకత

అమరావతిలో రథయాత్ర నిర్వహించడం ముదావహం

- రథయాత్రలో రథాన్ని లాగిన సిఎం చంద్రబాబు
- అమరావతి, పోలవరం పూర్తి చేస్తామని ప్రకటన
- ఆధ్యాత్మిక చింతన జీవితంలో భాగం కావాలని పిలుపు

2



- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్థక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

2



రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ–వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందనీ, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు.

అమరావతి, జులై 16 (సింగిడి)



## ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి

### గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ పోస్ట్

- తెలంగాణలో అమరరాజా సరికొత్త తయారీ కేంద్రం
- వైసీపీ హయాంలో అమరరాజాను తీవ్రంగా వేధించారన్న లోకేశ్
- ఏపీలో మళ్లీ కీలకపాత్ర పోషించాలని ఆకాంక్ష

2

## జగన్ 2.0 సూపర్ యాప్

### ఆవిష్కరించిన వైఎస్ జగన్

- వైసీపీ కుటుంబ సభ్యుల కోసమే ఈ కొత్త యాప్ అన్న జగన్

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
17 జులై 2026

# గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం సస్యశ్యామలం

అందులో భాగంగానే ఇటీవల దేవాదుల ప్రాజెక్టును సందర్శించామని, నేడు సీతారామ ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామని తెలిపారు. తెలంగాణలో చివరి ప్రాజెక్టు అయిన సీతారామ ద్వారా గోదావరి నీటిని గరిష్టంగా సద్వినియోగం చేసుకుంటామని ప్రకటించారు. అశ్వాపురంలోని సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం గోదావరి తీరంలో మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో సీతారామ ప్రాజెక్ట స్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 'దుమ్ముగూడెం రాజీవ్ సాగర్', 'రుద్రంకోట ఇందిరా సాగర్' ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రణాళికలు రూపొందించారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైనింగ్ పేరుతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచిందని విమర్శించారు. రీ-డిజైనింగ్ నెపంతో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. 24,000 కోట్లకు పెంచేసి ఖజానాపై అదనపు భారం మోపారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులపై ఇప్పటికే భారీగా నిధులు ఖర్చు చేశారని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ప్రజాధనం ఇప్పటికే అధిక మొత్తంలో వ్యయం కావడం వల్ల ఇప్పుడు ఈ ప్రాజెక్టులను నిలిపివేయడం సాధ్యం కాదని, అందుకే వీటిని ఎలాగైనా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న మిగిలిన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన, అత్యంత త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం. ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం అని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఇరిగేషన్‌పై లక్షల కోట్లు ఖర్చు చేశారని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నిర్మాణం చేసిన కాళేశ్వరం కూలిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. గొప్పలు చెప్పుకున్న గత ప్రభుత్వం తెలంగాణకు ఎంత నష్టం చేసిందో స్పష్టంగా కనపడుతోందని అన్నారు. సీతారామసాగర్ ప్రాజెక్టను తప్పకుండా పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాలను పారిస్తామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సీతారామసాగర్‌కు కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీతారామసాగర్ బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని అన్నారు. కాళేశ్వరానికి మూడేళ్లలో ఎలా బీటలు వచ్చాయో చూశామని చెప్పారు. మేడిగడ్డ కూడా బీఆర్ఎస్ హయాంలోనే కూలిందని విమర్శించారు. డీపీఆర్‌లో ఉన్న ఫౌండేషన్‌ను మార్చి మరో పద్ధతిలో నిర్మించారని తెలిపారు. సుందిళ్ల ప్రతిపాదిత స్థలంలో కాకుండా మరో చోట నిర్మించారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. రైతుల నుంచి తాము వరి కోనుగోళ్లు చేసి నేరుగా అకౌంట్‌లో డబ్బులు వేశామని వెల్లడించారు. మూడు బ్యారేజీలు టెస్ట్ నడుస్తోందని.. లాజికల్‌గా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో బ్యారేజీలు నిర్మించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్ట కూడా సరిగా ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఇరిగేషన్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే అని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఉద్ఘాటించారు. రాష్ట్రపాలన మొత్తం ఈ జిల్లా నుంచే కొనసాగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.




# అమ్మవారి అలక... మెప్మా పై కినుక..!

**ప్రభుత్వం జీవో ఇచ్చినా, అమలెందుకాగింది ?**

గత ప్రభుత్వం G.O.Ms.No.157 ద్వారా పే స్కేల్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం కొంతకాలం పూర్తి వేతనంతో పాటు అలవెన్సులు కూడా అందాయి. అయితే 2025 ఏప్రిల్ నుంచి అలవెన్సులు నిలిపివేయడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం విలీనంపై ముందుకు రావాలనే సంకేతాలు ఇస్తుంటే... ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన పరిపాలనా నిర్ణయం ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నిస్తున్నారు.

**పని ఆగలేదు... ఫైల్ మాత్రం ఆగిపోయింది**

పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మహిళా సంఘాల బలోపేతం, ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాలను మెప్మా సిబ్బంది నిరంతరంగా అమలు చేస్తున్నారని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. తమ బాధ్యతల్లో ఎలాంటి విరామం లేదని... కానీ తమ హక్కులకు సంబంధించిన ఫైల్ మాత్రం కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించే యంత్రాంగమే... పరిపాలనా ఆలస్యానికి బలవుతుందా? అనే ప్రశ్న వినిపిస్తోంది.

# ఓట్లు వేయలేదనే కక్ష

గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. "గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.



# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దేశంలో జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రత్యేకత

**అమరావతి,జులై16 (సింగిడి):**

భారతదేశంలో జగన్నాథ రథయాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందన్న సీఎం చంద్రబాబు, ఒడిశాలోని పూరీలో జరిగే రథయాత్రలో అందరూ పాల్గొనడం సాధ్యం కాదన్నారు. ప్రతిఏటా ఇక నుంచి జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. పూరీ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అలాంటి కార్యక్రమాన్ని అమరావతిలోనూ చేపట్టడం ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని గుంటూరు జిల్లా వెంకటపాలెంలోని టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి జగన్నాథ రథయాత్రకు శ్రీకారం చుట్టారు. రథాన్ని లాగే ముందు ఒడిశాలోని పూరీలో జగన్నాథ స్వామికి నిర్వహించే ప్రత్యేక పూజలను సీఎం చంద్రబాబు నిర్వహించారు. అనంతరం అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని తలపై పెట్టుకుని అమరావతి విశ్వ నగరంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువులో భాగంగా జగన్నాథ రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. ఆపై జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రమ్మలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగారు. సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, స్థానిక శాసనసభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిలో మొదటిసారిగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సేవతో పాటు ప్రజా సేవలో ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు చక్కగా పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని 16 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఆహారం అందిస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమన్నారు.




## జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించిన వైఎస్ జగన్

**అమరావతి, జులై 16 (సింగిడి)**

వైసీపీ తమ శ్రేణులను బలోపేతం చేసే దిశగా డిజిటల్ బాట పట్టింది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'జగన్ 2.0 సూపర్ యాప్'ను గురువారం ప్రారంభించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ యాప్‌ను వైసీపీ కుటుంబం కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పార్టీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. కార్యకర్తలు ఈ యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ సంబంధిత లింక్‌ను కూడా పంచుకుంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో ఇది అందుబాటులో ఉంటుందని, సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రచార చిత్రాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలో, జగన్ పార్టీ నేతలను ఉద్దేశించి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాలో తమ కార్యకర్తలు పోస్ట్ చేసే కంటెంట్‌ను తొలగిస్తున్నారని, ఈ క్రమంలో పార్టీ కోసం ఒక ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వ్యక్తం చేయవచ్చని, పార్టీతో నిత్యం అనుసంధానమై ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా నాయకులు, కార్యకర్తలు నిరంతరం సమన్వయంతో ఉండే అవకాశం ఉంటుందని జగన్ తెలిపారు. పార్టీ నిర్వహించే విలేకరుల సమావేశాలు, పర్యటనలు, అధికారిక ప్రకటనలు వంటి సమాచారం అంతా ఈ యాప్ ద్వారా ప్రతి కార్యకర్తకు చేరువవుతుందని అన్నారు. త్వరలోనే ఈ యాప్‌లో డిజిటల్ డైరీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

# ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పాలి

**అమరావతి, జులై 16 (సింగిడి)**

తెలంగాణలో అమరరాజా గ్రూప్ సరికొత్త తయారీ కేంద్రాన్ని (గిగా ఫ్యాక్టరీ) ప్రారంభిస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థ ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. అమరరాజా అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆయన బహిరంగంగా క్షమాపణలు చెప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జగన్ హయాంలో సొంత రాష్ట్రంలోనే ఎంతో ఆదరణ, ప్రోత్సాహం దక్కాల్సిన అమరరాజా వంటి దిగ్గజ సంస్థ తీవ్ర వేధింపులకు గురైందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేధింపుల కారణంగానే ఆ సంస్థ ఏపీ వదిలి పక్క రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. "గత ప్రభుత్వ దుందుడుకు చర్యల వల్ల జరిగిన నష్టానికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీకు క్షమాపణ చెప్పాలి" అంటూ అమరరాజా సంస్థ అధినేత, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌ను ఉద్దేశించి లోకేశ్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారిందని లోకేశ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో అమరరాజా గ్రూప్ చేపట్టబోయే విస్తరణ పనుల్లో ఆంధ్రప్రదేశ్ మళ్లీ కీలక పాత్ర పోషించాలని, ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

**లోకేశ్ సోషల్ మీడియా పోస్టు ఇలా...**

"జయదేవ్ గల్లా, ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్పి తీరాలి. గత నాలుగు దశాబ్దాలుగా అమరరాజా, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విజయగాథల్లో ఒకటిగా మాత్రమే నిలవలేదు. అది మన రాష్ట్రానికి అంతకుమించి ఎంతో చేసింది. ప్రపంచ స్థాయి తయారీ పరిశ్రమను సృష్టించింది, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించింది, చిత్తూరు జిల్లా పేరును, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో మీ సంస్థ ఎదుర్కొన్న వేధింపులు నిజంగా జరగకూడనివి. సొంత రాష్ట్రంలో పరిశ్రమ పెట్టి, అభివృద్ధి చేయాలనుకున్న ఒక పారిశ్రామికవేత్తకు ప్రోత్సాహం లభించాలి కానీ, బెదిరింపులు కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ఒక కంపెనీ, తన తదుపరి వృద్ధి కోసం మన రాష్ట్ర సరిహద్దులు దాటి చూడాల్సి రావడం నన్ను వ్యక్తిగతంగా ఎంతో బాధిస్తోంది.
మేము ప్రజల నమ్మకాన్ని తిరిగి నిలబెడుతున్న ఈ తరుణంలో, నేను మీకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను: ఆంధ్రప్రదేశ్ మరోసారి పరిశ్రమలకు, వ్యాపారాలకు అనుకూలమైన రాష్ట్రంగా మారింది.

## సక్సెస్ స్కూల్‌లో 'కల్మా' కలకలం..

**హైదరాబాద్, జులై 16 (సింగిడి)**

హైదరాబాద్ పాతబస్తీ పరిధిలోని సైదాబాద్‌లో ఉన్న ఒక ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. అక్కడి 'సక్సెస్ స్కూల్'లో రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి... ఇస్లామిక్ పవిత్ర సూక్తులైన 'కల్మా', 'సూరహ్ అల్-ఫాతిహా' చదివి, నేర్చుకు రావాలంటూ ఉపాధ్యాయురాలు హోంవర్క్ ఇవ్వడం, స్కూల్ డైరీలో లిఖిత పూర్వకంగా రాయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాలుడు స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత డైరీని గమనించిన తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్న వయసులోనే విద్యార్థులపై ఇలాంటి మతపరమైన అంశాలను రుద్దడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంధువులు, స్థానికులతో కలిసి నేరుగా స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని సూటిగా నిలదీశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. బాధితులు వెంటనే సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం వెలుగులోకి రాగానే అలర్ట్ అయిన సక్సెస్ స్కూల్ యాజమాన్యం.. ఇది సదరు టీచర్ వ్యక్తిగతంగా చేసిన పొరపాటుగా భావిస్తున్నామని పేర్కొంది. ఈ వివాదానికి కారణమైన ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా పర్వీన్‌ను తక్షణమే విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో తమ విద్యాసంస్థల్లో ఆమెకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని, పాఠశాలలో ఇలాంటి మతపరమైన బోధనలకు తావు లేదని స్పష్టం చేసింది. ఈ ఉదంతంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అత్యంత తీవ్రంగా స్పందించారు. 'కాంగ్రెస్ అంటే ముస్లింలు' అనే ప్రకటనల వల్లే ఇలాంటి శక్తులకు ప్రోత్సాహం లభిస్తోందని మండిపడ్డారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... చిన్నారిపై మతపరమైన ఒత్తిడి తీసుకురావడం ఘోరమని, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మేం వచ్చాక హిందూ విద్యార్థులకు బొట్టు తప్పనిసరి చేస్తాం: బండి సంజయ్

**హైదరాబాద్, జులై 16 (సింగిడి)**



తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చారన్న వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సంస్కృతిపై బలవంతంగా దాడి చేస్తున్నారని మండిపడ్డారు. హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని ఆదేశించడం దుర్మార్గమని విమర్శించారు. సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. సెక్యులర్ సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి హిందూ విద్యార్థులకు కల్మా, సూరా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. స్కూల్ డైరీలో ఈ హోంవర్క్ రాసినట్లు చెబుతున్నారు. మరోవైపు, కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చిన ఉపాధ్యాయురాలిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఇలాంటి ఘటన తమ పాఠశాలలో ఇదే తొలిసారి జరిగిందని వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై బీజేపీ నేతలు స్కూల్‌ను ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వెళ్లే మార్గాలను మూసివేశారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. తెలంగాణలోని కొన్ని పాఠశాలలు హిందూ విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని చిన్నారులను ఇస్లాం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని జైలుకు పంపాలని అన్నారు.

## మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్

**హైదరాబాద్, జులై 16 (సింగిడి)**

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్-1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్-1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్ఎంఆర్ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు.ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ హబ్‌లను కలుపుతూ పబ్లిక్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## న్యూజిలాండ్‌లో భూకంపం..

**న్యూఢిల్లీ, (సింగిడి)**

న్యూజిలాండ్‌లోని దక్షిణ ద్వీపంలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.3గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంత ప్రజలు తక్షణమే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని హెచ్చరించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన పిలిచే టె అనావ్ పట్టణానికి 40 కిలోమీటర్ల దూరంలో 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు న్యూజిలాండ్ నేషనల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ వెల్లడించింది. భూకంపం కారణంగా కొన్ని సెకన్ల పాటు భవనాలు ఊగిపోయాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

## సముద్రంలో పడవలు మునక.. 500 మంది మృతి!

**న్యూఢిల్లీ, (సింగిడి)**

జూన్ చివరి వారంలో మయన్మార్‌లోని రాఖైన్ రాష్ట్ర తీరం నుండి మెరుగైన ఆశ్రయం కోసం ఈ పడవలు బయలుదేరగా, అందులోని ప్రయాణికులలో అత్యధికులు రోహింగ్యాలే కాకుండా బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుండి వచ్చిన కొందరు కూడా ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఈ ప్రమాదాల వివరాల్లోకి వెళితే.. సుమారు 250 మంది ప్రయాణికులతో బయలుదేరిన మొదటి పడవ ప్రయాణం ప్రారంభించిన కొద్దిసేపటికే తీరంతో సంబంధాలు కోల్పోయి సముద్రంలో మునిగిపోగా, 280 మందితో వెళ్తున్న రెండవ పడవ జులై 8వ తేదీన అయేయార్వాడీ తీర ప్రాంతంలో మునిగిపోయింది. అంతర్జాతీయ సంస్థల ప్రాథమిక దర్యాప్తు నివేదికల ప్రకారం, ఈ రెండు పడవల్లోని ప్రయాణికులు ఎవరూ బతికే అవకాశం లేదని, అందరూ సముద్రంలో మునిగి మరణించి ఉంటారని అంచనా వేస్తున్నారు. మెరుగైన జీవితం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రమాదకరమైన సముద్ర మార్గాల్లో వలస వెళ్తూ, ఇలా తరచూ వందలాది మంది అభాగ్యులు సముద్ర గర్భంలో కలిసిపోతుండటం పట్ల అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశాయి.

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో 'బోనం' సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోల్కొండ బోనాలతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ జాతర, రాబోయే వారాల్లో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం సహా నగరంలోని ఇతర ప్రధాన ప్రాంతాల్లోనూ వైభవంగా కొనసాగనుంది.

## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,జులై 16(సింగిడి):**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. సొంతంగా ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోకసభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

## సీఎంతో టిజి 20 లీగ్ విజేతల భేటీ

రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యం పెంచే లక్ష్యంతో కొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం వెల్లడించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. టీజీ20 లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు పేరు తీసుకురావాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టీజీ 20 లీగ్ విజేత 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' ఫ్రాంచైజీ యాజమాన్యం, జట్టు సభ్యులు కలిశారు. సీఎంను కలిసిన వారిలో రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు, జట్టు సభ్యులు ఉన్నారు. టోర్నీ తొలి విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ ఛాంపియన్స్' టీమ్‌కు సీఎం అభినందనలు తెలిపారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
17-7-2026



# ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహించాలి

## ప్రతి ఓటును కాపాడుకోవాలి

## బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపు

**అల్వాల్, జూలై 16 (సింగిడి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహించి అర్హులైన ప్రతి ఓటు హక్కును పరిరక్షించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వెంకటాపురం, భూదేవి నగర్, ఖనాజీగూడ డివిజన్ల బీఆర్ఎస్ బీఎల్ఏలతో శుభశ్రీ గార్డెన్‌లో, ఖనాజీగూడ డివిజన్‌లోని శ్రీ సత్య సాయి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక అవగాహన, సమీక్ష సమా వేశాలు నిర్వహించారు. సర్ కార్యక్రమం అమలు తీరును ఎమ్మెల్యే క్షుణ్ణంగా సమీక్షించి, క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు ఎదుర్కొంటు న్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 2002 ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల నమోదు విధానం, ఒకే కుటుంబంలో కొంతమంది సభ్యుల పేర్లు మాత్రమే ఉండి మిగిలిన వారి పేర్లు జాబితాలో లేకపోతే అనుసరించాల్సిన విధానం, ఈసీ ఐ ఎన్ఈటి పోర్టల్‌లో బూత్ నంబర్ నమోదు చేసినప్పుడు వేరే బూత్ వివరాలు చూపిస్తున్న సాంకేతిక సమస్యలు, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ కొందరికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు అందకపోవడం, వృద్ధులకు ఫారమ్‌లు అందక ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు వంటి అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, మరణించిన వారు లేదా డబుల్ నమోదైన ఓటర్ల పేర్ల తొలగింపుకు ఫారం-7, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం-8 వినియోగంపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. బీఎల్ఏలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపో కుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్ కార్యక్రమానికి ఆగస్టు 3 వరకు మాత్రమే గడువు మిగిలి ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈలోపు ప్రతి ఇంటికి చేరుకుని ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ పూర్తి చేయాలని, కొత్త ఓటర్ల నమోదు, షిఫ్టింగ్ అయిన వారి వివరాల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి బాధ్యతతో సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశాల్లో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్ ఎస్ నాయకులు నేమూరి శ్రీధర్ గౌడ్, తోట నరేందర్ రెడ్డి, జేఏసీ వెంకన్న, సురేందర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, అరవింద్, సంపత్, సయ్యద్ మోసిన్, తాజుద్దీన్, వీరేశం, రాజేష్‌గౌడ్, ముత్యాలు, సెంథిల్, సంజీవ, ప్రేమ్, యాదగిరి, సతీష్, ప్రభాకర్, జనార్ధన్, శంకర్, రాజు, రామానుజన్, దేవేందర్, అనిల్, సాయి, సోమయ్య, సురేష్‌రెడ్డి, కన్న, వీణ, అమృత, జ్యోతి, ఆశా, సరిత, శ్రావణి, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ షాపుల వేలం బాధితులకు ఊరట

### శనివారం నుండి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

### హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి ఒప్పించిన

### కాంగ్రెస్ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి



**రామచంద్రాపురం, జూలై 16 (సింగిడి) :** రామచంద్రపురం మండల పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని దుకాణాలను (షాపులను) బహిరంగ వేలం పాటలో దక్కించుకున్న లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడింది. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఈ షాపుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ విషయమై ఆయన గురువారం సంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ సి. హెచ్. చలపతి తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేలం పాటలో షాపులు కొనుగోలు చేసి, నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించినప్పటికీ రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న ఆలస్యం వల్ల వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పీడీ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, సమస్య తీవ్రతను వివరించిన ప్రభాకర్ రెడ్డి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ నాయకుడి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రాజెక్ట్ డైరెక్టర్, వచ్చే శనివారం నుంచే (జూలై 18) రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారికంగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... "కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్స్ పరిధిలోని దుకాణాలను వేలంలో పాడుకున్న వ్యాపారులు ఎంతో కాలంగా రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. డబ్బులు కట్టినా ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సానుకూలంగా స్పందించిన అధికారులు శనివారం నుంచే రిజిస్ట్రేషన్లు చేయడానికి అంగీకరించారు." అని తెలిపారు. మరియు ఆయన మాట్లాడుతూ... "ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. కొల్లూరు పరిధిలోని వ్యాపారాలు త్వరగా ప్రారంభమైతే స్థానిక నివాసితులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. నిబంధనల ప్రకారం వేలం పాడుకున్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా, లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ తరపున తాము దగ్గరుండి చూసుకుంటాం" అని భరోసా ఇచ్చారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన చిలకమర్రి ప్రభాకర్ రెడ్డికి వేలం పాటదారులు మరియు స్థానిక నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించిన డిప్యూటీ కమిషనర్

**కుత్బుల్లాపూర్, జూలై 16 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన కార్యక్రమంపై అఖిలపక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, సోమేష్ యాదవ్, కిషోర్ చారి, సత్తి రెడ్డి, వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించడంతో పాటు ప్రతి అర్హుడైన ఓటరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



# బెల్ట్ షాపులపై ఏసీపీ ఆకస్మిక దాడులు



**ఎల్బీనగర్, జూలై 16,(సింగిడి) :** విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య స్వయంగా ఎన్‌టీఆర్ నగర్‌లోని బెల్ట్ షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహిం చారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులను తనిఖీ చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, బెల్ట్ షాపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు.

### బిఆర్ఎస్ హయాం లోనే..

# బిజేఆర్‌నగర్ అభివృద్ధి

### జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పల్లపు రవి



**జవహర్ నగర్, జూలై 16 (సింగిడి) : (సింగిడి) :** బిఆర్ఎస్ హయాంలోనే... బీజేఆర్ నగర్ ప్రగతి పదంలోకి దూసుకెళ్లింద ని ప్రజాస్వామ్యంలో అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పిం చాలని కోరుతూనే ప్రశ్నించే తత్వం పెరుగుతోందని మాజీ కార్పొరేటర్ పల్లపు రవి అన్నా రు. ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రి యను పురస్కరించుకొని జవ హర్ నగర్ డివిజన్ బి జె ఆర్ నగ ర్ మల్లికార్జున్ నగర్ లో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు సెంటర్ ను గురువారం మాజీ కార్పొరేటర్ వల్లపు రవి బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో బిఆర్ఎస్ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఓటర్ ఫారం ప్రతి ఒక్కరికి అందించాలని ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా బిఎల్వోలు బిఎల్ఎలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బీజేఆర్ నగర్ కాలనీ పేదల ఇళ్లకు 58,59వ జీవో ద్వారా పట్టాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని గుర్తు చేశారు . 30 ఏళ్ల నాటి నుండి మట్టి రోడ్డుకే పరిమితమైన బిజెపి నగర్ బిఆర్ఎస్ హయాంలో ప్రతి కాలనీలో డ్రైనేజీ సిసి రోడ్డుతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ఈ కార్య క్రమంలో విలాసాగర్ రవి, అహ్మద్, ఆనంద్, మురళీకృష్ణ, రమేష్, చంద్రమౌళి, వేణు, ధనలక్ష్మి ప్రశాం త్, కళావతి, జనలక్ష్మి, బి ఎల్ వోలు, అనురాధ, స్వాతి, సుజాత, మనిషా తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తి

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, జూలై 16,(సింగిడి) :** పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందని ఎల్ బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కు చెందిన మంజుల వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దానికి గాను రూ. 2 లక్షల ఎల్.ఓ.సీ. మంజూరు కాగా, ఆ చెక్కును బాధిత అన్న రాజు కి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ అక్క ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మా అక్క చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, యాదశంకర్, ముద్ద కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వానలు కురవాలని కప్పకావడి



**కొడంగల్, జులై 16(సింగిడి) :** తొలకరి ప్రారంభమై మాసం గడిచినప్పటికీ వం-ర్షం కురవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వాన రాకకై అన్నధాతలు ఎదురుచూస్తు న్నారు. ప్రాచీన కాలపు ఆనవాయితీగా కప్ప,వేపాకులు, కావడి తీసుకుని వచ్చి కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసూదన్ ల స్వగృహంలో కప్పకావడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ, పురాతన కాలంలో వర్షాలు కురవక పోతే కప్పకావడి కార్యక్రమం ఊరూరా చేసేదని, వానదేవుడిని స్తుతిస్తూ పాటలు పాడేదని,తన చిన్న వయసులో ఇలాంటి కార్యక్రమాలు చాలా జరిగేవని, అది గుర్తుకు చేసుకుని మళ్ళీ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. వర్షాలు కురిస్తేనే పంటలు బాగా పండుతాయని, అన్ని జీవరాశులకు తాగునీరు, ఆహారం, ప్రాణవాయువు దొరుకుతుంది అని అన్నారు. ఈకార్యక్రమంలో మిఠాయి రాజేందర్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల రుణాలతో రైతులు భరోసా రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్, జూలై 16(సింగిడి) :** జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆధ్వర్యంలో పరిగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు సుమారు రూ. 45 లక్షల 60 వేల విలువైన బంగారు ఆభరణాల పై, దీర్ఘకాలక రుణాల చెక్కులను గురువారం పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ డ్రోన్ సేవలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని, డ్రోన్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా రుణాలు అందించడం ద్వారా వారి వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా బలాన్నిచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# "సర్" హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 16 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286 కుత్బుల్లాపూర్ డివిజన్‌లో, 294 బహదూర్‌పల్లి డివిజన్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్లో ఏర్పాటు చేసిన "సర్" హెల్ప్ డెస్క్ కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ "సర్" కార్యక్రమం విజయ వంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో చేరిన బంజారా నాయకుడు నేనావత్ శంకర్ నాయక్

### కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**సంగారెడ్డి ప్రతినిధి జూలై 15 (సింగిడి) :** ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్టీ విభాగం చైర్మన్, మాజీ ఎంపీటీసీ, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కో-కన్వీనర్, ప్రముఖ బంజారా నాయకుడు నేనావత్ శంకర్ నాయక్ ఈరోజు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణ రక్షణ సేన రాష్ట్రప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి శంకర్ నాయక్‌ను రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన, గిరిజనులు, బంజారా సమాజ అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేనను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని శంకర్ నాయక్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రజల మధ్య తెలంగాణ రక్షణ సేనను విస్తరించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కవిత పిలుపునిచ్చారు. శంకర్ నాయక్ వంటి అనుభవజ్ఞుడైన బంజారా నాయకుడి చేరికతో సంగారెడ్డి జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, రవిచంద్ర, నెమలికొండ వేణుమాధవ్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ బాలయ్య, దయాకర్ రెడ్డి, మల్లశెట్టితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శంకర్ నాయక్‌కు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం
17-7-2026

# ఎడిటోరియల్

Editorial

## దేశంలో డీ లిమిటేషన్ రాజకీయాలు!

మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ దృష్టి అంతా ఇప్పుడు డీలిమిటేషన్‌పై ఉంది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. దీంతో ఈసారి ఎలాగైనా గండం గట్టెక్కేందుకు అవసర మైన వ్యూహాలతో సిద్ధం అవుతోంది. ఆయా రాష్ట్రాల్లోని రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగబోతున్నట్లు తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. రాజకీయాల్లో శాశ్వత శతృవులు, శాశ్వత మిత్రులు ఉండరని ఈ సమావేశాలు బహుశా నిరూపించనున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు దేశ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ 131వ సవరణ బిల్లు మళ్లీ చర్చకు రావచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లును ఆమోదించాలంటే లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ఇటీవల మారుతున్న రాజకీయ సమీకరణాలు ఎన్డీఏ ప్రభుత్వానికి ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలను మరింత పెంచుతున్నాయనే చర్చ సాగుతోంది. గతంలో ఈ బిల్లుకు తగిన మద్దతు లభించక పోవడంతో అది ఆమోదం పొందలేదు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, శివసేనలో జరిగిన మార్పులు, అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గం నుంచి వస్తున్న సంకేతాలు ఎన్డీఏకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా సుప్రియా సూలే చేసిన వ్యాఖ్యలు ఈ అంశంపై కొత్త చర్చకు దారితీశాయి. డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచించే అవకాశముందని సుప్రియా సూలే వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరిం చుకుంది. గతంలో ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సీట్ల పెంపుపై చర్చించేందుకు సిద్ధమని పేర్కొనడం ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు వస్తోంది. ఇటీవల ఎన్సీపి అధినేత శరద్ పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే కలుసుకుని చర్చించారు. బయటకు సాదాసీదా భేటీ అయినా రేపటి పార్లమెంట్ సమావేశాల్లో మద్దతకు సంబంధించిన వ్యవహారం సాగిందనే అంటున్నారు. ఇప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఎన్డీఏకు ఇప్పటికే ఉన్న బలానికి అదనంగా తిరుగుబాటు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, శివసేన నుంచి మారిన సభ్యులు, శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే సంఖ్య గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అయితే మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో డీఎంకే వైఖరి అత్యంత కీలకంగా మారింది. డీఎంకేకు చెందిన ఎంపీలు మద్దతు ఇస్తే ప్రభుత్వం లక్ష్యానికి మరింత చేరువ అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన, సీట్ల సంఖ్య పెంపు, అలాగే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు సంబంధించిన అంశాలు వేగవంతం చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అందుకే ఈ బిల్లుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై ఇంకా పూర్తి స్థాయిలో తమ వైఖరిని వెల్లడించలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశాలపై గతంలో వ్యక్తమైన ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలను ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి చర్చ జరుగుతుంది.. ఎన్డీఏ మూడింట రెండు వంతుల మెజారిటీని సమీకరించగలదా.. శరద్ పవార్ వర్గం, డీఎంకే వంటి పార్టీల తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. అనే అంశాలపై దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ సమావేశాల్లో జరిగే పరిణామాలు దేశ రాజకీయ దిశను ప్రభావితం చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇండియా కూటమిలో ఉన్న డిఎంకె బయటకు వచ్చింది. దీంతో డిఎంకె కూడా కొంత మెత్తబడి ఎన్‌డిఎకు అనుకూలంగా మారనుందన్న సమాచారం. మరోవైపు తమిళనాడులో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ఆ రాష్ట్రంలోని ఇండియా కూటమిలో విభేదాలు మరింత బయటపడుతున్నాయి. సీఎం జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో చేతులు కలిపేందుకు ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే) విముఖత చూపుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు.. జాతీయ స్థాయిలో మాత్రం కూటమిలో భాగస్వాములుగా కొనసాగవచ్చని విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే) అధ్యక్షుడు తిరుమావళవన్ సూచించారు. దీనికి కాంగ్రెస్ మద్దతు తెలుపగా.. డీఎంకే మాత్రం ససేమిరా అంటోంది. ఈ సందర్భంగా డీఎంకే ఎంపీ గణపతి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. 'ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొమ్మిదేళ్లుగా మాతో ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు టీవీకేకు మద్దతిస్తోంది. ఇది వెన్నుపోటుతో సమానం. మంత్రి పదవుల కోసమే కాంగ్రెస్ డీఎంకేను వదిలేసింది. ఇప్పుడు వీసీకేను మధ్యవర్తిగా వాడుకుంటూ మళ్లీ డీఎంకేను ఒప్పించే ప్రయత్నం చేస్తోందని వ్యాఖ్యానించారు. కేరళ, బెంగాల్ తరహా రాజకీయాలు తమిళనాడులో పనికిరావని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం.. తమిళనాడులో టీవీకే మూడో ప్రధాన రాజకీయ పార్టీగా అధికారంలోకి వచ్చిందని, దీంతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. అంతేకాకుండా.. ప్రస్తుతం పార్లమెంట్‌లో ఒక్క ఎంపీ కూడా లేని టీవీకేను ఇండియా కూటమిలో భాగంగా పరిగణించాలా అనే అంశంపైనా చర్చించాల్సిన అవసరముందని రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ తమను వదులుకోవడం ద్వారా అది ఇండియా కూటమికే నష్టం చేకూరుస్తుందని ఆయన చెప్పుకొచ్చారు. మొత్తంగా ఇప్పుడు బిజెపి గేమ్‌ప్లాన్ బాగా వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది.

## ఉపాసన, ఉపవాసాలకు ఉద్దిష్ట మైనది దక్షిణాయణం

మన పూర్వీకులు సూర్య భగవానుని గమనం ప్రకారం యుగాలుగానూ, యుగాలను సంవత్సరములుగానూ, సంవత్సరములను మాసములు గానూ, మాసములను వారములు గానూ, వారములను రోజులు గానూ, రోజులను జాములు గానూ, జాములను ఘడియలు గానూ కాల గమనాన్ని తెలుసు కోవటానికి విభజించారు. సంవత్సరంలో ఉన్న 12 మాసములను రెండు ఆయనాలుగా విభజించారు.




సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు దక్షిణాయణం ఏర్పడతాయి.

ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు. సాయన ఉత్తరాయణం ప్రతి సంవత్సరం డిశంబర్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అలాగే సాయన దక్షిణాయణం జూన్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అయితే భారతీయ గ్రహగణితం నిర్ణయ గణితం కాబట్టి ఆయనాంశ కారణంగా సాయన, నిర్ణయ సంక్రాంతుల్లో ఇలా మార్పు కననిపిస్తుంది.

ఖగోళ శాస్త్రం ప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు. కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే. అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని ఉత్తరాయణం అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు. సూర్య గమణాన్ని బట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు . భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు. ఏడాదిలో 6నెలలు ఉత్తరాయణం.. 6నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి నప్పుడు ఉత్తరాయణం.. కర్కాటక రాశిలోకి ప్రవేశించి నప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి. ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు, మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు. శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపసాన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, అధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి. ముఖ్యంగా దక్షిణాయనం లోనె పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయ పక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే, వారి అను గ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించక పోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య. ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్ఫణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్న వారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల ) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యరాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగి పోతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ ఏడు జూలై 16న దక్షిణాయనం ప్రారంభం అయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**




## "కాలం ఎత్తిపోతుంది... రైతు ఆశలు అడుగంటుతున్నాయి"

ప్రపంచంలో ఎక్కడో జరిగే యుద్ధం వార్త మనం టీవీలో చూసి వదిలేస్తాం. కానీ ఆ యుద్ధం ప్రతిధ్వని మన ఊరి బోరులో, మన పొలంలో వినిపిస్తుంది.
యుద్ధం, డీజిల్ ధర, ఎరువు ధర, రైతు అప్పు ఈ గొలుసు ఇప్పుడు విరిగే స్థితికి వచ్చింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం తర్వాత యూరియా బస్తా 400 రూపాయలు పెరిగింది. డీజిల్ లీటర్ 100 దాటింది.
ఇంతలో "ఎల్ నీనో" వచ్చి వాతావరణాన్ని ఇంకా గందరగోళం చేసింది. వర్షాలు ఆలస్యం, ఎండలు ముందు. వాతావరణ శాఖ చెబుతున్న లెక్కల ప్రకారం ఈసారి దక్షిణ భారతంలో ఖరీఫ్ వర్షాలు సాధారణం కంటే 20% తక్కువ పడే అవకాశం ఉంది.

ఫలితం? భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. గతంలో 400 అడుగులకు వచ్చిన నీరు ఇప్పుడు 800 అడుగులకు వెళ్లినా రావడం లేదు. బోర్లు ఎండిపోతున్నాయి. రైతు కళ్లలో ఖరీఫ్ ఆశలు కూడా ఎండిపోతున్నాయి.
ఒకవైపు ప్రకృతి కోపం. మరోవైపు మార్కెట్ కుతంత్రం. మధ్యలో నలిగిపోతున్నది అన్నదాత.

పరిష్కారం ఏమిటి?
జల సంరక్షణ: ప్రతి గ్రామంలో చెరువులు, కుంటలు పూడిక తీత తప్పనిసరి
పంట మార్పిడి: నీరు ఎక్కువ తాగే వరికి బదులు సజ్జ, జొన్న లాంటి తక్కువ నీటి పంటలు
ప్రభుత్వ సహాయం: ఎరువు, విత్తన సబ్సిడీ యుద్ధ కాలంలో కూడా కొనసాగించాలి
"కాలం ఎత్తిపోతుంది" అని రైతు అంటున్నాడు. కాలాన్ని మనం ఆపలేము. కానీ కాలానికి అనుగుణంగా మనం మారాలి. లేకపోతే రేపు పొలం కాదు, కంచం ఖాళీ అవుతుంది.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**

## ఒకే దేశం - ఒకే ఎన్నికలు..! రాజ్యాంగ విరుద్ధం, అహేతుకం

భారతదేశంలో లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు వీలుగా, సరికొత్త రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదిత బిల్లు ద్వారా మన రాజ్యాంగంలో కొత్తగా నిబంధన 82ఎ ను చేర్చడంతో పాటు, నిబంధనలు 83, 172 లను సవరించాలని యోచిస్తున్నారు. అయితే ఈ చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందాలంటే ఉభయ సభలలో 2/3 వంతు మంది సభ్యుల ప్రత్యేక సమ్మతితో పాటుగా, దేశంలోని కనీసం సగానికి పైగా రాష్ట్రాల శాసనసభల అధికారిక ఆమోదం కూడా ఖచ్చితంగా అవసరమవుతుంది. దేశ మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి సంఘం సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనతో ముందుకు సాగుతోంది. ఈ ఉన్నత స్థాయి సంఘ నివేదిక ప్రధానంగా ఎన్నికల వ్యయాల తగ్గింపు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వల్ల పాలనలో ఏర్పడే తాత్కాలిక స్తబ్దత నుండి విముక్తి, ప్రభుత్వ అధికార యంత్రాంగం, ఉద్యోగులపై పడే అదనపు భారాన్ని తగ్గించడం, అలాగే దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం వంటి 4 ముఖ్యమైన లక్ష్యాల ప్రాతిపదికన సిద్ధమైంది. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు సుమారు 1.5 శాతం మేర పెరుగుతుందని ఈ నివేదికలో ప్రముఖ ఆర్థిక నిపుణుల పరిశోధనలను ఉటంకిస్తూ పేర్కొన్నప్పటికీ, మన దేశ సుదీర్ఘ చారిత్రక వాస్తవాలను పరిశీలిస్తే ఈ వాదనలు ఎంతమాత్రం నిలబడలేవని స్పష్టమవుతోంది.

మన దేశ చరిత్రను ఒక్కసారి గమనిస్తే, ఉమ్మడి ఎన్నికలు జరిగిన తొలి రోజుల్లో అంటే 1952 నుండి 1967 వరకు దేశ ఆర్థిక వృద్ధి రేటు కేవలం 3.5 శాతంగా మాత్రమే నమోదైంది. ఆనాటి ఆర్థిక స్థితిని నిపుణులు అత్యంత మందగమన వృద్ధిగా అభివర్ణించేవారు. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా, వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరిగిన 2003 నుండి 2011 మధ్య కాలంలో దేశం 8 నుండి 9 శాతం అత్యధిక వార్షిక ఆర్థిక వృద్ధిని నమోదు చేసి సరికొత్త మైలురాయిని చేరుకుంది. కాబట్టి ఎన్నికలన్నీ ఒకేసారి జరగడమే దేశ ఆర్థిక వృద్ధికి ప్రధాన కారణం అనడం ఎంతమాత్రం సమంజసం కాదు. అలాగే ఎన్నికల వ్యయం విషయానికి వస్తే, ప్రభుత్వం అధికారికంగా భరించే ఎన్నికల వ్యయం దాని మొత్తం ఆదాయ వ్యయాల ప్రణాళికలో 0.1 శాతం కంటే చాలా




తక్కువగా ఉంటుంది. నిజానికి ఎన్నికల సమయంలో జరిగే విపరీతమైన వ్యయమంతా అభ్యర్థులు,రాజకీయ పక్షాలు చేసే అనధికారిక వ్యయాల రూపంలోనే సాగుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే దాదాపు రూ. 1,00,000 కోట్లకు పైగా లెక్కల్లో లేని అక్రమ ధనం చేతులు మారిందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఈ భారీ అక్రమ ధన ప్రవాహాన్ని నియంత్రించడం సాధ్యపడదు సరికాదా, ఇది ఆ వ్యయాన్ని అంతా ఒకే సమయంలో మరింతగా కేంద్రీకరిస్తుంది. నిరంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని వాదించే వారు, ఒకేసారి ఎన్నికల వల్ల 5 ఏళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఒకే సమయంలో అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించిపోయే తీవ్రమైన ఆటంకాన్ని గమనించడం లేదు.

రాజ్యాంగ పరమైన కోణం నుండి ఈ ప్రతిపాదనను విశ్లేషిస్తే, సుప్రసిద్ధ కేశవానంద భారతి కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, పారదర్శకమై, ఉచిత ఎన్నికల నిర్వహణ అనేవి రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగాలు. కాబట్టి ఎలాంటి అత్యవసర చట్ట సవరణల ద్వారా కూడా ఈ మూల సూత్రాలను మార్చడానికి వీలులేదు. ఒకవేళ ఒకేసారి ఎన్నికల విధానం అమల్లోకి వచ్చిన తర్వాత, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం మధ్యలోనే తన శాసనసభ విశ్వాసాన్ని కోల్పోతే, అక్కడ తదుపరి 5 ఏళ్ల కాల పరిమితి ముగిసే వరకు ప్రజాదరణ లేని బలహీనమైన ప్రభుత్వం కొనసాగాల్సి వస్తుంది లేదా సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలనను విధించాల్సి వస్తుంది. ఈ రెండు పరిస్థితులు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైనవి. దీనితో పాటుగా, ఈ విధానాన్ని బలవంతంగా ప్రవేశపెట్టడం కోసం కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని అడ్డగోలుగా పెంచడం లేదా తగ్గించడం చేయాల్సి వస్తుంది. ఇది ప్రజలు తమ ప్రతినిధులకు 5 ఏళ్ల పాటు పరిపాలించేందుకు ఇచ్చిన పవిత్రమైన తీర్పును, వారి ప్రాథమిక ఓటు హక్కును కాలరాయడమే అవుతుంది. జాతీయ స్థాయి ఎన్నికలు, ప్రాంతీయ స్థాయి ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల సాధారణ ఓటర్లపై జాతీయ పార్టీల ప్రచారం, జాతీయ స్థాయి అంశాల ప్రభావం ఎక్కువగా ఉండి, వారు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీకి ఓటు వేసే అవకాశం పెరుగుతుంది. దీనివల్ల స్థానిక సమస్యలపై పోరాడే చిన్న, ప్రాంతీయ పార్టీల ఉనికి తీవ్రంగా దెబ్బతిని, సమాఖ్య స్ఫూర్తి నిర్వీర్యమవుతుంది.

ఈ ప్రతిపాదిత జమిలి ఎన్నికల విధానంలో మన రాజ్యాంగం కల్పించిన మూడో అంచె ప్రభుత్వాలైన గ్రామ పాలక సంస్థలు, పురపాలక సంఘాల ఉనికిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం మరొక పెద్ద లోపం. రాజ్యాంగ సవరణలైన 73, 74 నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావు, అవి పూర్తిగా రాష్ట్ర ఎన్నికల సంఘాల స్వతంత్ర పరిధిలో ఉంటాయి. మన దేశంలోని ముంబై, బెంగళూరు లాంటి పెద్ద నగరాల పురపాలక బడ్జెట్లు కొన్ని చిన్న రాష్ట్రాల మొత్తం బడ్జెట్ కంటే చాలా పెద్దవిగా ఉంటాయి. ఈ స్థానిక సంస్థల ఎన్నికలను జమిలి ఎన్నికల పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల ఎన్నికల వ్యయాలు, భద్రతా దళాల మోహరింపు, పరిపాలనాపరమైన సవాళ్లు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం ఆశిస్తున్న భారీ వ్యయాల ఆదా అనేది కేవలం ఒక ఊహాజనిత భ్రమగా మాత్రమే మిగిలిపోతుందని స్పష్టమవుతోంది. మన రాజకీయ వ్యవహారాల్లో నిజంగా మార్చాల్సిన తీవ్రమైన సమస్యలైన పరిమితి లేని రాజకీయ పార్టీల వ్యయాలు, ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ, రాజకీయ రంగంలో పెరిగిపోతున్న నేరమయం ,అధికార దుర్వినియోగం వంటి అసలైన రుగ్మతలను ఈ సరికొత్త చట్టం ఏమాత్రం పరిష్కరించడం లేదు. ప్రజాస్వామ్య రక్షణకు నిజంగా కావాల్సింది రాజకీయ విరాళాల పారదర్శకత, నేరచరితులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా కఠినమైన చర్యలు చేపట్టడం, ఎన్నికల సంఘానికి మరింత స్వతంత్ర అధికారాలు కల్పించడం. అంతేకాని కేవలం ఎన్నికల క్యాలెండర్‌ను మార్చడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసలైన లోపాలు ఏమాత్రం సరిదిద్దబడవు.

**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**



సింగిడి Singidi శుక్రవారం 17-7-2026

# ఇసుక క్వారీని రద్దు చేయాలి

రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్..

క్వారీ నిలిపివేయకుంటే కరీంనగర్‌లో భారీ ఆందోళన హెచ్చరిక

మాజీ మంత్రి గంగుల కమలాకర్



**కరీంనగర్, జులై16(సుంగిడి):** కొత్తపల్లి మండలం ఖాజీపూర్‌లో ప్రభుత్వం అనుమతించిన ఇసుక క్వారీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనకు మాజీ మంత్రి గంగుల కమలాకర్ మద్దతు తెలిపారు. గురువారం ఖాజీపూర్ ప్రధాన రహదారిపై గ్రామస్థులతో కలిసి బైఠాయించి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ఖాజీపూర్‌తో పాటు ఎలగందుల, బద్దిపల్లి, నాగులమల్యాల గ్రామాల్లో సాగు, తాగునీటి సమస్యలు తీవ్రంగా మారాయని ఆరోపించారు. మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని విమర్శించారు. దీనివల్ల రైతుల పంటలు ఎండిపోతుండగా, సాగునీటి కొరత తీవ్రంగా పెరిగిందని పేర్కొన్నారు. క్వారీ వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. రైతుల సంక్షేమం కంటే ఆదాయానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపిస్తూ, తన సొంత వ్యవసాయ భూమి కూడా నీటి కొరతతో ఎండిపోయిందని తెలిపారు. గ్రామస్థుల కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇసుక క్వారీని వెంటనే నిలిపివేసి, అక్కడ ఉన్న లారీలను వెనక్కి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కరీంనగర్‌లో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ విభాగ అధికారి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు తమ నిరసనను విరమించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన సేవలతో ప్రజల విశ్వాసం పొందాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జూలై 16 (సింగిడి):** ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వారి విశ్వాసాన్ని చూరగొనాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఎ. సత్తయ్య, పి. వెంకన్న గౌడ్, ఎం.ఎ. హబీబ్‌లను అభినందించిన ఆయన, పదోన్నతితో బాధ్యతలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. విధులను నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో నిర్వహిస్తూ ఉన్నతాధికారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న కే డి సి సి బ్యాంకు వైస్ చైర్మన్



**జమ్మికుంట, జులై 16 (సింగిడి) :** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన కొండిళ్ల రాజయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ రాజయ్య పార్థివ దేహానికి పూలమాలవేసి ఆయన అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, రాజయ్య మృతి బాధాకరమని అందరితో కలిసి మెలిసి ఉండే వ్యక్తి అకాల మరణం చెందడం తనను దిగ్భ్రాంతి కి గురిచేసిందని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని అన్నారు.



# పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

రూ.109 లక్షలతో రెండు డివిజన్లలో రహదారులు

కేంద్ర మంత్రి బండి సంజయ్

## డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

### కేంద్ర నిధులతో నగర రూపురేఖలు మారనున్నాయని వెల్లడి

**కరీంనగర్, జులై16(సింగిడి):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని, కేంద్రం నుంచి భారీ నిధులు తీసుకువచ్చి నగరంతో పాటు మొత్తం పార్లమెంట్ పరిధిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా మంత్రి బండి సంజయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి 36వ డివిజన్ మారుతీనగర్‌లో రూ.60 లక్షలు, 27వ డివిజన్ శివాజీనగర్‌లో రూ.49 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ కాంక్రీట్ రహదారులు, డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ, అమృత్-1, అమృత్-2, పట్టణాభివృద్ధి నిధులు, తాజాగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కరీంనగర్‌కు భారీగా కేంద్ర నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద వచ్చిన రూ.840 కోట్లతో నమూనా రహదారులు, పాదచారుల వంతెనలు, ఆకాశ నడక మార్గాలు, పర్యావరణహిత రవాణా సౌకర్యాలు, శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలో సిమెంట్ కాంక్రీట్ రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత ఏడు సంవత్సరాలుగా ఎంపీగా కరీంనగర్ అభివృద్ధికి రూ.22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకువచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి 12-బి హోదా, న్యాయ కళాశాల మంజూరు, ఎస్సార్ఆర్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా, తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి, క్రీడా మౌలిక వసతులు, ప్రభుత్వ ఆసుపత్రులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ఆధునిక పరికరాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు గతంలో 20 వేల సైకిళ్లు పంపిణీ చేశామని, ఈ ఏడాదీ కూడా మరో 20 వేల సైకిళ్లను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కేంద్ర నిధులు తీసుకువచ్చి కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# 15 ఏళ్ల బాలిక ప్రాణాలు కాపాడిన యశోద వైద్యులు

అరుదైన రక్తవ్యాధిపై విజయం

సకాలంలో ప్లాస్మా మార్పిడి చికిత్సతో

ప్రాణాపాయం నుంచి బయటపడిన బాలిక

సీనియర్ కన్సల్టెంట్ యశోద అస్పత్రి హెమటో, ఆంకాలజీ, బోన్ మ్యారో మార్పిడి నిపుణుడు డాక్టర్ కరణం అశోక్ కుమార్




**కరీంనగర్, జులై16(సింగిడి):** అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన రక్త సంబంధిత వ్యాధి థ్రోంబోటిక్, థ్రోంబోసైటోపెనిక్ పర్పురా (టీటీపీ)తో బాధపడుతున్న 15 ఏళ్ల బాలికకు సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఈ వివరాలను కరీంనగర్ యశోద బ్రాంచ్ లో గురువారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో సోమాజిగూడ యశోద అస్పత్రి వైద్యులు హెమటో, ఆంకాలజీ, బోన్ మ్యారో మార్పిడి నిపుణుడు డాక్టర్ కరణం అశోక్ కుమార్ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద కుటుంబం కు చెందిన ధర్మపురి వాస్తవ్యులు లక్ష్మన్ కూతురు నిషిత మొదట జగిత్యాల లలో వైద్యం తీసుకొని ప్లేట్ లెట్స్ పడిపోవడం తో సోమాజిగూడ యశోద అస్పత్రి కి తరలించగా ట్రీట్మెంట్ తీసుకొన్నది,తీవ్రమైన జ్వరం, రక్తహీనత, రక్తస్రావంతో బాధపడుతున్న బాలికను ముందుగా మరో ఆసుపత్రిలో చికిత్స చేసినప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోవడంతో యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ బహుళ విభాగాల వైద్య నిపుణులు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి టీటీపీగా నిర్ధారించారు. వెంటనే వైద్య అత్యవసర విభాగంలో చేర్చి తాజా ఘనీభవించిన ప్లాస్మా ఎక్కించడం, వెంటిలేటర్ సహాయంతో చికిత్స ప్రారంభించారు. హెమటాలజీ నిపుణులు నిర్వహించిన చికిత్సా ప్లాస్మా మార్పిడి (థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్) తో బాలిక ఆరోగ్యం వేగంగా మెరుగుపడింది. రెండు సెషన్లలోనే పరిస్థితి స్థిరపడటంతో వెంటిలేటర్ తొలగించారు. ప్లేట్‌లెట్ల సంఖ్య సాధారణ స్థాయికి చేరిన అనంతరం కొద్ది వారాల పరిశీలన తర్వాత పూర్తిగా కోలుకున్న ఆమెను డిశ్చార్జ్ చేశారు, తగ్గని జ్వరం, వేగంగా తగ్గుతున్న ప్లేట్‌లెట్లను సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్‌గా నిర్లక్ష్యం చేయరాదని, టీటీపీ వంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి ప్లాస్మా మార్పిడి చికిత్స అందించడం ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. క్లిష్టమైన రక్త సంబంధిత వ్యాధులు, బోన్ మ్యారో సమస్యలు, చిన్నారుల క్యాన్సర్ అత్యవసర పరిస్థితులకు యశోద ఆసుపత్రిలోని అత్యాధునిక బోన్ మ్యారో మార్పిడి విభాగం 24 గంటల నిపుణుల వైద్య సేవలకు సిద్ధంగా ఉందని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ విలేకరుల సమావేశం లో యశోద బ్రాంచ్ మేనేజర్ సుధీర్ రెడ్డి, పొన్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు నిధులు విడుదల చేయండి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ప్రణవ్ విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన మంత్రి



**జమ్మికుంట, జులై 16 (సింగిడి):** హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను కోరారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. హైదరాబాద్ సెక్రటేరియట్ లో మంత్రిని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ప్రొసీడింగ్ ఇచ్చి అసంపూర్తిగా నిర్మించిన దానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని,దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు దళిత బంధు నిధులు అందేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి దీనిపై ఇప్పటికే పలుమార్లు చర్చించినట్టు తెలిపారు. మరోవైపు హుజురాబాద్ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని సంక్షేమ పాఠశాలలో వసతులకు నిధులు కేటాయించాలని కోరారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన జీవనం





బాలవికాస సేవలు అభినందనీయం

పెద్దంపల్లి సర్పంచ్ పద్మకుమార్

ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**జమ్మికుంట, జులై 16 (సింగిడి) :** జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో, ఆదిత్య-అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారంతో గురువారం పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎగిత పద్మ-కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని అన్నారు. వ్యాధులు రాకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహారపు అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని సూచించారు. శిబిరంలో ఆదిత్య-అమృత ఆసుపత్రి వైద్య బృందం సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, రూ. 55 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసింది. గ్రామానికి విచ్చేసిన స్పెషలిస్ట్ వైద్యులను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. బియ్యం, రవ్వ, మైదా, చక్కెర వంటి తెల్లటి ఆహార పదార్థాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారు. అధిక కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల ఊబకాయం పెరిగి మధుమేహం, రక్తపోటు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం అధికమవుతుందని హెచ్చరించారు. ప్రతిరోజూ నడకతో పాటు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాయామశాలలను వినియోగించుకోవాలని సూచించారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని వంటింటినే ఆరోగ్యశాలగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. బాలవికాస పరిధిలోని 14 సెంటర్లకు చెందిన 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, దాదాపు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా, ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు, పాలకవర్గ సభ్యులు ఎం. రాజయ్య, డి. ప్రవళిక, డి. తిరుమల, ఎం. రాజేష్, డి. లావణ్య, కే. గణపతి రెడ్డి, పి. అఖిల, బాలవికాస విలేజ్ లీడర్ పి. రమ, ఆదిత్య-అమృత ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్ రావు, మహేష్, శ్రావణ్, సంతోషిని, పూజ, శ్రావ్య, సుమలతతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలి

ప్రత్యేక ఓటర్ల సవరణ

ప్రక్రియ 50 శాతం పూర్తి

నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్, జులై 16(సింగిడి):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ దాదాపు 50 శాతం పూర్తయిందని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక ఓటర్ల సవరణ, గృహ గణన దరఖాస్తుల సేకరణ, ఆన్‌లైన్ నమోదు, నకిలీ ఓట్ల తొలగింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిందని, గడువు ముగిసేలోపే ప్రక్రియను పూర్తిచేసేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు నగరపాలక సంస్థ పరిధిలో లక్షా 70 వేలకుపైగా ఓటర్ల వివరాల సవరణ పూర్తయిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ స్థాయి అధికారులు గృహ గణన దరఖాస్తులను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని చెప్పారు. ఇంకా దరఖాస్తులు సమర్పించని ఓటర్లు తమ బూత్ స్థాయి అధికారిని సంప్రదించి వాటిని పొందాలని, పూర్తి చేసి వెంటనే సమర్పించాలని సూచించారు. మరణించిన వారి ఓట్లు, నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు సహకరించాలని కమిషనర్ కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# స్నేహితుడి జ్ఞాపకార్థం ఆలయానికి కూల్ వాటర్ ఫిల్టర్ వితరణ

**జమ్మికుంట, జులై 16 (సింగిడి) :** వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని మహాగణపతి శ్రీ పార్వతీ దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన బైరెడ్డి మధుసూదన్ రెడ్డి కుమారుడు బైరెడ్డి సావంత్ రెడ్డి జ్ఞాపకార్థం సావన్త్ రెడ్డి మిత్రులు కూల్ వాటర్ ఫిల్టర్ విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి కీర్తిశేషులు సావంత్ రెడ్డి జ్ఞాపకార్థంగా అతను స్నేహితులు కుటుంబ సభ్యులు కలిసి ఈ వాటర్ ఫ్రిడ్జ్ నీ బహూకరించినట్లు గ్రామస్తులు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ద సమ్మిరెడ్డి ఒక ప్రకటనలొ తెలిపారు. ఆ పరమశివుడి ఆశీస్సులతో మధుసూదన్ రెడ్డి తోపాటు వారి స్నేహితుల కుటుంబాలు అందరు కూడా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# టీడబ్ల్యూజేఎఫ్ పోరాట ఫలితం...

పెండింగ్ అక్రిడిటేషన్ కార్డుల జారీకి గ్రీన్‌సిగ్నల్

అర్హులైన జర్నలిస్టులకు వెంటనే కార్డులు

ఇవ్వాలని జిల్లా అధికారులకు ఆదేశాలు

**కరీంనగర్, జులై 16(సింగిడి):** జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల సమస్యపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) చేపట్టిన ఆందోళనలు ఫలించాయని సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న అక్రిడి టేషన్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు కార్డులు జారీ చేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డులు నిలిచిపోవడంతో ప్రాంతీయ, వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనలు నిర్వహించడంతో పాటు, అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడి చేసి ఆందోళన చేపట్టిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, శాఖ ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయడంతో నెలలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు ఊరట లభించిందని పేర్కొన్నారు. అలాగే అక్రిడిటేషన్ ప్రక్రియలో ఉన్న మిగిలిన సాంకేతిక సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని కోరారు. జర్నలి స్టుల సమస్యను సానుకూలంగా పరిష్కరించి అక్రిడిటేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకున్న సమాచార, పౌర సంబంధాల శాఖకు టీడబ్ల్యూ జేఎఫ్ యాక్టింగ్ అధ్యక్షుడు పి. రాంచందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ధన్యవాదాలు తెలిపారు.



సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శుక్రవారం 17-7-2026




## మేడారం అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన

# పూర్తి చేయాలి

### భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : మంత్రి సీతక్క




మేడారం మహాజాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. గురువారం మేడారంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జూలై 16 (సింగిడి):** మేడారం మహాజాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. గురువారం మేడారంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవంలో మొక్కలు నాటి, హరిత హోటల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడారం--తాడ్వాయి, పస్రా--మేడారం, చిన్నబోయి నపల్లి--కొండాయి--ఊరట్టం రహదారుల విస్తరణకు తక్షణమే అంచనాలు సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని, భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్యూ లైన్ల ఆధునికీకరణతో పాటు ఆలయ పరిసరాల్లో డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జంపన్న వాగు పరిసరాలను సుందరీ కరించి, వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. దీంతో భక్తులకు ఏడాది పొడవునా పుణ్యస్నానాలకు నీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని వెల్లడించారు. ప్రధాన రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని, స్మృతి వనాన్ని సహజసిద్ధంగా అభివృద్ధి చేయాలని సూచించారు. భక్తుల కోసం కాటేజీలు, విశ్రాంతి కేంద్రాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య, రవాణా, భద్రత వంటి మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మేడారం ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, ఆలయ పూజారులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహాముత్తారం మోడల్ స్కూల్‌లో వివాదం

### స్థానిక గిరిజన ఉపాధ్యాయులను తొలగించారని ప్రిన్సిపాల్‌పై కుల సంఘాల జేఏసీ తీవ్ర ఆరోపణలు

### కృష్ణవేణిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



**మహాముత్తారం, జూలై 16 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపాడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పై కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తీవ్ర ఆరోపణలు చేసింది. స్థానిక గిరిజన ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతూ నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపడుతున్నారని జేఏసీ చైర్మన్ పీక కిరణ్ ఆరోపించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఫలితాలు సాధించిన స్థానిక ఫిజిక్స్ అధ్యాపకురాలు కృష్ణవేణిని విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఆమె స్థానంలో భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మోడల్ స్కూల్‌కు చెందిన తన స్నేహితుడిని తీసుకురావడానికే ఈ చర్యలు చేపట్టినట్లు ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఖాళీల భర్తీకి పత్రికా ప్రకటన ఇచ్చి స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పించాల్సి ఉండగా, గుట్టుచప్పుడు కాకుండా కాటారం మండలం గంగారం మోడల్ స్కూల్‌లో డెమో నిర్వహించి నియామకం చేపట్టారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ ఇప్పటివరకు ముగ్గురు గిరిజన ఉపాధ్యాయులు, ఒక ఎస్సీ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించారని, ఇదే ఆయన గిరిజనుల పట్ల ఉన్న వైఖరికి నిదర్శనమని కిరణ్ విమర్శించారు. మరోవైపు, గత విద్యా సంవత్సరంలో తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైన ఒక ఉపాధ్యాయురాలిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. స్థానిక మండలానికి చెందిన ఫిజిక్స్ అధ్యాపకురాలు కృష్ణవేణిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో మోడల్ స్కూల్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని జేఏసీ హెచ్చరించింది. ఈ సమావేశంలో కుల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ అజ్మీర పూల్ సింగ్ నాయక్, కోఆర్డినేటర్ రామగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు బాధ్యతగా

# వ్యవహరించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, జూలై 16(సింగిడి):** నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో రహదారి భద్రతపై పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ రాజ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం, అధిక వేగాన్ని నియంత్రించడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం వంటి చర్యలు ప్రమాదాల తగ్గింపుకు కీలకమని తెలిపారు. ముఖ్యంగా యువత రహదారి నియమాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని మైనర్లుకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల పై ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులు రేడియం స్టిక్కర్స్ ఏర్పాటు చేయడం, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని తెలిపారు. రహదారి ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను గంటలోపు ఆసుపత్రికి తరలించడం అత్యంత ముఖ్యమని, అలా సహాయం చేసిన వారికి "రహవీర్ అవార్డు"తో పాటు రూ. 25,000 నగదు ప్రోత్సాహకంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్. ఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, విద్యాశాఖ అధికారి రాజేందర్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, జిల్లా ఈ డార్ మెనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి



**కీసర, జూలై 16, (సింగిడి) :** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, రైతు సహకార సంఘాలను రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రాలుగా మార్చే కుట్ర చేస్తుందని నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. పీఏసీఎస్ లలో పదవులను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తున్న అంశంపై నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బీజేపీ పంచాయతీ రాజ్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కీసర డివిజన్ అధ్యక్షుడు బాలరాజు యాదవ్ లు ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు.. ఇందులో భాగంగా పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులకు తక్కువ వడ్డీపై పంట రుణాలు అందించడం, పంటల కొనుగోలు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరా, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే ఈ సంఘాలు రైతు ప్రయోజనాల పరిరక్షణకు ప్రతీకలని, అలాంటి సంస్థలను కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయ కేంద్రాలుగా మార్చాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంపూర్ణ రుణమాఫీ హామీ నేటికీ అమలు కాలేదని, రైతు భరోసా పథకాన్ని పలుమార్లు వాయిదా వేసిందని, పంటలకు బోనస్ విషయంలో కూడా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులకు పదవులు కట్టబెట్టడంలో మాత్రం అసాధారణ వేగం ప్రదర్శించడం ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయని అన్నారు. రైతు సహకార సంఘాల నియామకాల అంశంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నప్పటికీ,న్యాయ ప్రక్రియను సైతం పక్కనబెట్టి తొందరపాటుగా ముందుకు సాగడం ప్రభుత్వ అసలు ఉద్దేశాన్ని బయటపెడుతోంది ప్రజల ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు, సొంత వర్గాల రాజకీయ పునరావాసమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. -రైతుల ఆత్మగౌరవాన్ని, సహకార సంఘాల స్వతంత్రతను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ భారతీయ జనతా పార్టీ సహించదని, రైతుల పక్షాన అన్ని స్థాయిల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఎస్.వి.నూకరాజుకు పీహెచ్.డీ



**పటాన్చెరు, జూలై 16 (సింగిడి) :** దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి శ్రీధరాల వి. నూకరాజును డాక్టరేట్ వరించింది. 'దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం, వాహకం ద్వారా పనిచేసే వినూత్నమైన స్థానిక (టాపికల్) టెరిఫ్లునోమైడ్ ఔషధ రూపాల అభివృద్ధి' అనే శీర్షికతో ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ పవన్ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ నూకరాజు పరిశోధన, దైహిక దుష్ప్రభావాలను కనిష్ట స్థాయికి తగ్గిస్తూ, ఔషధాన్ని నేరుగా ప్రభావిత ప్రాంతానికి చేరవేసే లక్ష్యంతో, రుమటాయిడ్ ఆర్థరైటిస్, అటోపిక్ డెర్మటైటిస్ చికిత్స కోసం టెరిఫ్లునోమైడ్ యొక్క వినూత్న స్థానిక ఫార్ములేషన్లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిందని తెలియజేశారు. ఈ అధ్యయనం, ఆశాజనకమైన చికిత్సా పనితీరుతో, సురక్షితమైన, లక్షిత, రోగికి అనుకూలమైన చికిత్సా పద్ధతులను అందిస్తూ, వ్యాధి-నిర్దిష్ట స్థానిక ఫార్ములేషన్లను విజయవంతంగా అభివృద్ధి చేసిందన్నారు.

## మై హోమ్ అవతార్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

### ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన



**రాజేంద్రనగర్, జూలై 16 (సింగిడి) :** నార్సింగి సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ గేటెడ్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే.. ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులతో కలిసి రథోత్సవంలో పాల్గొని జగన్నాథుడికి భక్తి పూర్వకంగా ప్రణామం చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ జగన్నాథ స్వామి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. "రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని.. వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. ఈ రథయాత్ర మహోత్సవంలో మై హోమ్ అవతార్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. హరినామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగే దొంగ అన్నట్లు ఉంది

### సింగరేణి కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించలేరు

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి




**భూపాలపల్లి, జూలై 16 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డా. చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సింగరేణి భరోసా యాత్రపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థను దాదాపు దివాలా తీసే పరిస్థితికి నెట్టారని ఆరోపించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన తాడిచెర్ల--1 బొగ్గు బ్లాక్‌ను తిరస్కరించేలా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్నారు. అనంతరం ఆ బ్లాక్‌ను జెన్‌కోకు కేటాయించిన తర్వాత ప్రైవేట్ సంస్థావీ=కు అప్పగించి, మార్కెట్ విలువ కంటే అధిక ధరకు బొగ్గు కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకుని సింగరేణికి భారీ నష్టం కలిగించారని విమర్శించారు. సింగరేణిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం దానికి కేటాయించిన గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించి సంస్థ ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. అధికారంలో నుంచి దిగే సమయానికి సింగరేణిపై దాదాపు రూ. 30 వేల కోట్ల అప్పుల భారం మోపి ఆర్థికంగా బలహీనపరిచిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్లే సింగరేణి ఇబ్బందుల్లో పడిందని, అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం సింగరేణిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చొరవతో వేలం లేకుండానే తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌కు అవసరమైన అన్ని అనుమతులు లభించేలా అక్కడి బీజేపీ ప్రభుత్వంతో సమన్వయం చేసి పనులు ప్రారంభించేందుకు కిషన్‌రెడ్డి కృషిచేశారని తెలిపారు. ప్రజలు బీజేపీపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికే కేంద్ర ప్రభుత్వం సింగరేణి పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలు, మెడికల్ బోర్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీల భర్తీ, సంస్థ అభివృద్ధి వంటి అంశాలను ఎందుకు పరిష్కరించలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను విస్మరించి, ఇప్పుడు కార్మికులపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనన్నారు.

సింగరేణి భరోసా యాత్ర రాజకీయాల కోసం కాదని, కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన బాధ్యతాయుతమైన యాత్ర అని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకోవడం బీజేపీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ఆ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి ఎందుకు ప్రారంభించలేదో గండ్ర వెంకటరమణారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు ఆ బొగ్గు బ్లాక్ సింగరేణి అభివృద్ధికి ఉపయోగపడుతోందన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే డిమాండ్ చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేస్తే సంస్థ మరింత బలోపేతం కావడంతో పాటు కార్మికుల సంక్షేమానికి కూడా ఉపయోగపడుతుందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మాట్లాడే ముందు వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసిన ఆ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే బదులు రైతులకు జరిగిన నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నట్లు నటిస్తూ అసలు లక్ష్యం మాత్రం బీజేపీపై దాడి చేయడమేనని చూస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ అవగాహన ఉందనే అనుమానం ప్రజల్లో మరింత బలపడుతోందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలను నిలదీయకుండా బీజేపీపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా అండగా నిలుస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బీజేపీ ఎప్పటికీ రాజీ పడదని, మెడికల్ బోర్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు, కార్మికుల సంక్షేమం, సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారమే బీఎంఎస్ ప్రధాన లక్ష్యమని అన్నారు. మెడికల్ బోర్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీల భర్తీ, కార్మికుల సంక్షేమం వంటి అంశాలపై బీఎంఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరుకల గణపతి, బ్రాంచ్ కార్యదర్శి రేణికుంట్ల మల్లేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, రాష్ట్ర నాయకులు బట్టు రవి, బిజెపి అర్బన్ అధ్యక్షులు గీస సంపత్కుమార్, బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ ఊరటి మునేందర్, పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

### ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి బ్యూరో, జూలై 16 (సింగిడి):** జిల్లాలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు, డీపీఎంలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితర అధికారులతో వివో భవనాలు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సులు (జూజలు), వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివో భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా ఉండేలా స్ట్రీమ్‌లైన్ చేయాలని, మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలకు కొత్త టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని , మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అభివృద్ధి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ జగదీష్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిప్ అబాకస్‌లో రామంతాపూర్ విద్యార్థుల ఘన విజయం



**ఉప్పల్, జూలై 16 (సింగిడి) :** శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ త్రీలో నిర్వహించిన తెలంగాణ రీజినల్ ప్రాడిజీ 2026 పోటీలో తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి 3,200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలో సిప్ అబాకస్ రామంతపూర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు విభాగాలలో అద్భుత విజయాలు సాధించారు. విజేతలు ప్రథమ స్థానం:టి. హేమశ్రీ ,ద్వితీయ స్థానం మనీష్ చారి,తృతీయ స్థానం టి. రోహిత్. అంతే కాకుండా సిప్ అబాకస్ రామంతపూర్‌కు చెందిన 30 మందికి పైగా విద్యార్థులు పెర్ఫార్మెన్స్ అవార్డులు అందుకుని సంస్థకు విశేష గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిప్ అబాకస్ రామంతపూర్ హెడ్ పి. స్వప్న మాట్లాడుతూ,విద్యార్థులు సాధించిన ఈ అద్భుత విజయాలు ఎంతో గర్వకారణమని తెలిపారు. సిప్ అబాకస్,బ్రెయిన్ జిమ్,స్పీడ్ రైటింగ్ శిక్షణల ద్వారా పిల్లల్లో ఏకాగ్రత,జ్ఞాపకశక్తి,విశ్లేషణాత్మక ఆలోచన,ఆత్మ విశ్వాసం విద్యా ప్రతిభ గణనీయంగా మెరుగుపడతాయని వివరించారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులందరికీ ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పిల్లలను నిరంతరం ప్రోత్సహిస్తూ,సంస్థపై విశ్వాసం ఉంచిన తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి ప్రధాన కారణమని అన్నారు. చివరగా పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఆమె హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఇక ఏ టిఫిన్ అక్కర్లేదు.. జస్ట్ 10 నిమిషాల్లోనే సూపర్‌ఫుడ్..

**ఆరోగ్యకరమైన మల్టీ గ్రైన్ జావా లేదా అంబలి అనేది సంప్రదాయమైన, పోషక విలువలు పుష్కలంగా ఉన్న పానీయం.. రోజువారీ ఆహారంలో దీనిని చేర్చుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలను, ముఖ్యంగా ఇనుము, కాల్షియంను అందించవచ్చు.**

చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ ఎంతో మేలు చేసే ఈ జావను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. దీంతో పాటు.. ఎండాకాలం ఈ జావ శరీరాన్ని చల్లగా ఉండేలా చేస్తుంది. అద్భుతమైన విటమిన్లు, ఖనిజాలు కలిగిన ఈ రెసిపీని ఇంట్లో జస్ట్ 10 నిమిషాల్లో తయారు చేసుకోవచ్చు.. దీని తయారీలో రెండు ప్రధాన దశలు ఉంటాయి.. మల్టీ గ్రైన్ పిండి తయారీ, జావా తయారీ.





మల్టీ గ్రైన్ పిండిని తయారుచేయడానికి, ముందుగా నాణ్యమైన ధాన్యాలను ఎంచుకోవాలి. ఈ మిశ్రమంలో రాగులు 1 నెస్త్ర, సజ్జలు 1/4 నెస్త్ర, ఓట్స్ 100 గ్రాములు, జొన్నలు 1/4 నెస్త్ర, బార్లీ 1/4 నెస్త్ర వంటి వాటిని ఉపయోగించవచ్చు. ఈ ధాన్యాలన్నీ విడివిడిగా తీసుకోవాలి. ప్రతి ధాన్యాన్ని ఒక డ్రై పాన్‌లో వేసి, అది కమ్మటి వాసన వచ్చేవరకు, సుమారు ఐదు నుండి ఏడు నిమిషాల పాటు తక్కువ మంటపై వేయించుకోవాలి. వేయించిన తర్వాత, వాటిని పూర్తిగా చల్లారనివ్వాలి. తరువాత, ఈ వేయించిన ధాన్యాలను మిల్లులో లేదా ఇంట్లో గ్రైండర్ ఉపయోగించి మెత్తటి పొడిలాగా తయారు చేసుకోవాలి. ఈ పొడిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు. ఇది చాలా రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఈ పిండిని ఒకసారి సిద్ధం చేసుకుంటే, జావాను ఎప్పుడంటే అప్పుడు సులభంగా తయారు చేసుకోవచ్చు.

జావా తయారీ కోసం, ముందుగా స్టవ్ వెలిగించి, ఒక మూకుడు లేదా గిన్నెను పెట్టి, అందులో తగినంత నీటిని వేసుకోవాలి. ఉదాహరణకు, మూడు కప్పుల జావ కోసం, మూడు కప్పుల నీటిని తీసుకోవచ్చు. నీరు బాగా మరుగుతున్నప్పుడు, మరో కప్పులో మూడు స్పూన్ల మల్టీ గ్రైన్ పిండిని తీసుకుని, కొద్దిగా నీటిని కలిపి ఉండలు లేకుండా మెత్తటి పేస్ట్ లాగా తయారు చేసుకోవాలి. ఈ విధంగా పేస్ట్ తయారు చేసుకోవడం వల్ల జావా వండేటప్పుడు ఉండలు కట్టకుండా ఉంటుంది.

నీరు మరుగుతున్నప్పుడు, దానికి రుచికి సరిపడినంత ఉప్పును చేర్చాలి. ఆ తర్వాత, ముందుగా సిద్ధం చేసుకున్న మల్టీ గ్రైన్ పిండి పేస్ట్‌ను మరుగుతున్న నీటిలో నెమ్మదిగా కలుపుతూ ఉండాలి. దీన్ని సుమారు పది నిమిషాల పాటు చిన్న మంటపై బాగా మరిగించాలి. ఈ పది నిమిషాల మరుగుదల వల్ల ధాన్యాలు చక్కగా ఉడికి, జావా చిక్కబడి, మంచి రుచి వస్తుంది.



ఉడికిన తర్వాత స్టవ్ ఆపి, జావాను చల్లారనివ్వాలి. జావా చల్లారే సమయంలో, గరిటెతో అప్పుడప్పుడు తిప్పుతూ ఉండాలి. ఇలా చేయడం వల్ల పైన మీగడ కట్టకుండా జావా ఏకరీతిగా ఉంటుంది. జావా పూర్తిగా చల్లారిన తర్వాత, ఒక గ్లాస్ తాజా మజ్జిగను కలుపుకోవాలి. మజ్జిగ కలపడం వల్ల జావా రుచి మరింత పెరుగుతుంది. వేసవిలో శరీరానికి చలువ చేస్తుంది. ఇలా తయారుచేసుకున్న మల్టీ గ్రైన్ జావా ఎంతో ఆరోగ్యకరమైనది, పోషకమైనది.. రుచికరమైనది. ఇది శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

## ఉదయం లేవగానే చేయకూడని తప్పులు..!

మనం ఉదయం నిద్ర లేచిన మొదటిగంటలో చేసేపనులు మన రోజంతా ఎలా ఉంటుందో నిర్ణయిస్తాయి. అయితే, తెలియకుం డానే మనం చేసే కొన్ని తప్పులు మనఆరోగ్యాన్ని,పనిసామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మన రోజంతాఉత్సాహంగా,ఆరోగ్యంగా సాగాలంటే ఉదయాన్నే చేసే కొన్ని అలవాట్లను వెంటనే మానుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మనం చేసే చిన్నచిన్న పొరపాట్లు మన మాన సిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావంచూపుతాయి. అలాంటి తప్పులేంటో తప్పక తెలుసుకోవాలి.. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు:

**వెంటనే మానుకోవాల్సిన 5 అలవాట్లు:**

**నిద్రలేవగానే స్మార్ట్‌ఫోన్ చూడటం:**

చాలామందికళ్లు తెరవగానే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ నోటిఫి కేషన్లు చూస్తుంటారు. ఇది మెదడును వెంటనే ఒత్తిడికి గురిచేస్తుంది. దీనివల్ల రోజంతా ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. కనీసం నిద్రలేచిన అ-రగంట వరకు ఫోన్ ముట్టుకోకపోవడం ఉత్తమం.

**ఖాళీ కడుపుతో కాఫీ/టీ తాగడం:**

బెడ్ కాఫీ తాగడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. పాలలో ఉండే కెఫీన్ ఖాళీ కడుపులో యాసిడ్స్ ఉత్పత్తిని పెంచుతుంది. దీనికి బదులుగా గోరువెచ్చని నీరు లేదా నిమ్మరసం తాగడం వల్ల శరీరం లోపల శుభ్రపడుతుంది.

**అలారం స్నూజ్ చేయడం:**

మరో 5నిమిషాలు పడుకుందాం అని స్నూజ్ బటన్ నొక్కడం వల్ల గాఢ నిద్రకు అంతరాయం కలుగుతుంది. దీనివల్ల మెదడు గందరగోళానికి గురై, రోజంతా మగతగాం) ఉంటుంది.

**అల్పాహారం మానేయడం:**

ఉదయం పూట సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీనివల్ల నీరసం, చిరాకు మరియు పనిలో ఏకాగ్రత లోపిస్తుంది. ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం చాలా అవసరం.

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం

## నేడు కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

**తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు. బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు.**

బ్రిటిష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే.. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు.



జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు.

తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది.

ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు.


వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించు కున్నారు.

ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు. ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు... ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధని'ని ఆయన ఎక్కుపెట్టారు.

ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘ సేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి.

ఆయన 130కి పైగా గ్రంథాలు రాసాడు. అన్ని గ్రంథాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు.

వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.



**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# ఫ్రిజ్‌లో ఉన్నా ఆహారం పాడవుతోందా?

## వేసవిలో వంటకాలు తాజాగా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి

సాధారణంగా వేసవి కాలంలో వాతావరణంలోని వేడి వల్ల ఆహారంలోని కొవ్వులు విచ్ఛిన్నమై దుర్వాసన వస్తుంటాయి. ముఖ్యంగా పాలు, పప్పులు ఇంకా మాంసం వంటి ప్రోటీన్ అధికంగా ఉండే పదార్థాలపై బ్యాక్టీరియా ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది.

ఆహారాన్ని ఎక్కువ సేపు బయట ఉంచి ఆ తర్వాత ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కూడా అది త్వరగా పాడవుతుంది. అందుకే రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతను ఎప్పుడూ 1 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉండేలా చూసుకోవాలి. వండిన ఆహారాన్ని రెండు గంటలలోపు ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది. అయితే వేడి వేడి పదార్థాలను నేరుగా ఫ్రిజ్‌లో పెట్టకుండా గది ఉష్ణోగ్రతకు వచ్చే వరకు చల్లారనివ్వాలి. లేదంటే ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరిగి ఇతర వస్తువులు కూడా పాడయ్యే అవకాశం ఉంది.

ఫ్రిజ్‌లో వద్దు..

చాలామంది చేసే పొరపాటు ఏంటంటే.. బంగాళాదుంపలు, ఉల్లిపాయలు ఇంకా వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెట్టడం. నిజానికి వీటిని ఫ్రిజ్‌లో పెడితే తేమ వల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. వీటిని ఎప్పుడూ గాలి తగిలే పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. అలాగే ఫ్రిజ్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం చాలా అవసరం. మురికిగా ఉన్న ఫ్రిజ్ బ్యాక్టీరియా వృద్ధికి కేంద్రంగా మారుతుంది. ఆహారాన్ని నిల్వ చేసేటప్పుడు ఎప్పుడూ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. పాత ఆహార పదార్థాలను కొత్తగా వండిన వాటితో కలపడం వల్ల కూడా ఇన్ఫెక్షన్లు త్వరగా వ్యాపిస్తాయి. కాబట్టి తాజాగా ఉన్నవాటిని విడిగా ఉంచడమే క్షేమం.

పండ్లు ఇంకా కూరగాయల విషయంలో జాగ్రత్తలు అవసరం. ఆకుకూరలను కడిగి బాగా ఆరబెట్టిన తర్వాత పేపర్ టవల్‌లో చుట్టి నిల్వ చేస్తే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కోసిన పండ్లను వెంటనే తినేయాలి లేదా గాలి చొరబడని డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇక మాంసాహారం విషయానికి వస్తే మాంసం, చేపలు ఇంకా గుడ్లను ఇతర వంటకాలతో కలవకుండా విడివిడిగా భద్రపరచాలి. వేసవిలో వండని మాంసం నుండి వెలువడే బ్యాక్టీరియా వండిన పదార్థాలకు సోకకుండా చూసుకోవడం అత్యంత కీలకం. ఇది ఆహారం కలుషితం కాకుండా కాపాడుతుంది.

పదేపదే వేడి చేయొద్దు..

ఆహారాన్ని పదేపదే వేడి చేసే అలవాటును మానుకోవాలి. ఒకటి కంటే ఎక్కువసార్లు వేడి చేయడం వల్ల ఆహారం యొక్క నాణ్యత ఇంకా భద్రత రెండూ దెబ్బతింటాయి. వంట చేయడానికి ఇంకా వడ్డించడానికి ఎప్పుడూ శుభ్రమైన పాత్రలను మాత్రమే వాడాలి. చేతులు కూడా శుభ్రంగా కడుక్కోవడం వల్ల బ్యాక్టీరియా వ్యాప్తిని అరికట్టవచ్చు. వేసవిలో ఆహారం పట్ల తీసుకునే ఇటువంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆరోగ్య సమస్యల నుండి రక్షిస్తాయి. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారాన్ని పద్ధతి ప్రకారం నిల్వ చేసి తీసుకోవడం ద్వారా ఈ వేసవిని ఆరోగ్యంగా గడపవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని గుర్తించి మెలిగితే ఎటువంటి ఇబ్బందులు ఎదురుకావు.



స్టాక్ మార్కెట్ Stock Market

# అనిశ్చితి వేళ.. పసిడిలోకి భారీ పెట్టుబడులు

దిల్లీ: ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో పసిడి ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు) లోకి రూ. 31,561 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఆరు రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పెట్టుబడిదార్లు మొగ్గుచూపారు. త్రైమాసికం వారీగా చూస్తే.. పెట్టుబడులు 36% పెరిగి రూ. 23,132 కోట్లకు చేరాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) గణాంకాల ప్రకారం.. 2025 జనవరి–మార్చిలో రూ. 5654 కోట్ల పెట్టుబడులు రాగా, ఈ ఏడాది రూ. 31,561 కోట్లుగా నమోదయ్యాయి. జనవరిలో రూ. 24,040 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 5,255 కోట్లు, మార్చిలో రూ. 2,266 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి. జనవరితో పోలిస్తే మార్చిలో పెట్టుబడుల వేగం తగ్గింది. ఈక్విటీ మార్కెట్లపై మదుపర్లు ఆసక్తి చూపడం, పసిడి ధరల పెరుగుదల వల్ల కొత్త పెట్టుబడులు కొంత నెమ్మదించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పసిడి ఫండ్ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ గత ఏడాది రూ. 58,888 కోట్లుగా ఉండగా, ఇప్పుడు అవి మూడు రెట్లు పెరిగి రూ. 1.71 లక్షల కోట్లుగా ఉన్నాయి. పసిడి ఈటీఎఫ్‌ల్లో ఫోలియోల సంఖ్య 69.69 లక్షల నుంచి 1.24 కోట్లకు పెరిగింది. బంగారంపై సాధారణ మదుపర్లకు పెరుగుతున్న ఆసక్తిని ఇది సూచిస్తోంది. నగలు, నాణేల రూపంలో భౌతికంగా బంగారాన్ని కొనుగోలు చేయడం కంటే ఈటీఎఫ్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టడం సులభం. ఇవి పారదర్శకంగా ఉండ టంతో పాటు సులభంగా విక్రయించొచ్చు అని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియన్ అనలిస్ట్ నేహల్ మేశ్రామ్ తెలిపారు. మార్కెట్ అస్థిరంగా ఉన్నప్పుడు పోర్ట్‌ఫోలియోను బ్యాలెన్స్ చేయడానికి పసిడి ఈటీఎఫ్ ఒక మంచి సాధనంగా పనిచేస్తుందని ఆమె వివరించారు.



# ఎస్‌బీఐ నుంచి 2 కొత్త స్కీమ్స్.. ఏప్రిల్ 15 నుంచే అవకాశం.. కనీస పెట్టుబడి ఎంతంటే?

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టేవారికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ) అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ శుభవార్త చెప్పింది. ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగంలో స్వల్పకాలిక డెట్ ఇండెక్స్‌లను ట్రాక్ చేస్తూ రెండు కాన్‌స్టంట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్‌లను ప్రారంభిం చింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (NFO) ఏప్రిల్ 15న ప్రారంభమై ఏప్రిల్ 20న ముగుస్తుంది. మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాజాగా రెండు కొత్త స్కీమ్స్‌ను (NFO) లాంచ్ చేసింది. ఈ వారం లాంచ్ అవుతున్న మొత్తం 4 ఫండ్లలో ఇవి కీలకమైనవి.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెల కోట్లాది రూపాయలు మ్యూచువల్ ఫండ్స్ లోకి వచ్చాయి. అయితే గత మార్చి నెలలోనే రూ. 40 వేల కోట్లకు పైగా కొత్తగా ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మూలధన లాభాలను అందించేందుకు అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు న్యూ ఫండ్



ఆఫర్ తో వస్తున్నాయి. ఈ వారం మొత్తం 4 కొత్త ఫండ్స్ లాంచ్ అవుతున్నాయి. అందులో రెండు లాంగ్–షార్ట్ ఫండ్స్ ఉన్నాయి. వీటి సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 15వ తేదీ నుంచే మొదలవుతోంది. తమ ఫోర్ట్ ఫోలియోలని ఖాళీలను పూరించడంతో పాటు దీర్ఘకాలంలో మంచి లాభాలను అందించేలా కొత్త ఫండ్స్ ను ఫండ్ హౌస్‌లు లాంచ్ చేస్తున్నాయి. ఈ స్కీమ్‌ల గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం..

**ఎస్‌బిఐ నుంచి వచ్చిన 2 కొత్త స్కీమ్స్ ఇవే:**

**ఎస్‌బిఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3–6 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్:**

**సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం:** ఏప్రిల్ 15, 2026.
ముగింపు తేదీ: ఏప్రిల్ 20, 2026.
కనీస పెట్టుబడి: రూ. 5,000.

**ఎస్‌బీఐ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 9–12 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్:**

సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం: ఏప్రిల్ 15, 2026.
**ముగింపు తేదీ:** ఏప్రిల్ 20, 2026.
**కనీస పెట్టుబడి:** రూ. 5,000.

ఈ రెండు ఫండ్లు కూడా డెట్ ఇండెక్స్ విభాగంలోకి వస్తాయి. తక్కువ కాలవ్యవధిలో స్థిరమైన ఆదాయం కోరుకునే పెట్టుబడిదారులకు ఇవి మంచి ప్రత్యామ్నాయంగా ఉంటాయి.

**పెద్ద పెట్టుబడిదారుల కోసం మరో 2 స్కీమ్స్:**

కేవలం ఎస్‌బీఐ మాత్రమే కాకుండా, వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ కూడా రెండు లాంగ్–షార్ట్ ఫండ్లను లాంచ్ చేస్తోంది. ఇవి ప్రధానంగా అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టే వారి కోసం రూపొందించారు.

**స్కీమ్స్:**

డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ ఎక్స్ టాప్ 100, డబ్ల్యూఎస్ఐఎఫ్ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్.

**గడువు:**

ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 29 వరకు.

**కనీస పెట్టుబడి:** రూ. 10 లక్షలు.

### మోమిన్‌పేట తహసీల్దార్‌గా
## మునీరుద్దీన్ బాధ్యతలు స్వీకరణ



**వికారాబాద్, (సింగిడి):** ఇటీవల పలువురు తహసీల్దార్లను ఉన్నత అధికారులు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా పరిధిలోని మోమిన్ పేట తహసీల్దార్ గా మునీరుద్దీన్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతు సమస్యలను పారదర్శకంగా పరిష్కరించి న్యాయం చేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. రైతు సమస్యలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు.

### అదుపుతప్పిన కారు..ఫుట్‌పాత్‌పైకి
## దూసుకెళ్లిన మారుతి కారు



**ఎల్బీనగర్, (సింగిడి):** అదుపుతప్పిన కారు ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లిన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చేరుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలోని వి.యం. హోమ్ గేటు ముందు ఉన్న ఫుట్‌పాత్‌ను ఎక్కిన మారుతి ఎక్స్ ఎల్ 6 (టిఎస్ 08 హెచ్7775) కారు అక్కడ ఉన్న చెరుకు రసం బండిని ఢీకొట్టింది. ఈ ఘటనలో చెరుకు రసం బండి పూర్తిగా ధ్వంసం కాగా, కారు ముందు భాగం కూడా తీవ్రంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ ఘటన సమయంలో ఫుట్‌పాత్‌పై పాదచారులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదానికి గల కారణాలపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత
### వర్షాకాల ముందస్తు పనుల నిమిత్తం కోతలు ప్రజలు
### సహకరించాలని ఏఈ వి. మణికంఠ విజ్ఞప్తి

**రాజేంద్రనగర్, (సింగిడి):** వర్షాకాల ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, ఫీడర్ల అత్యవసర నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ (ఆపరేషన్స్) వి. మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లు, ఫీడర్ల వారీగా విద్యుత్ నిలిపివేసే సమయాలు, ప్రభావిత ప్రాంతాల వివరాలు :మార్కెట్ యార్డ్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు 11 కేవీ బాలాజీ నగర్ ఫీడర్,మంచిరేవుల, మంతి విల్లాస్, గ్రీన్ ల్యాండ్ మరియు జై హిందూ కాలనీ. ఇబ్రహీంబాగ్ సబ్ స్టేషన్ పరిధిలో..సమయం: ఉ 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు11 కేవీ ఓస్మాన్ సాగర్ ఫీడర్ పరిధిలోని ఇబ్రహీంబాగ్ నుండి నార్సింగి మెయిన్ రోడ్ తారామతి బారాదరి మెయిన్ రోడ్ మార్వా టౌన్‌షిప్,ఆనంద బేహిల్స్ రోడ్ నెం. 29, 30 మిలిటరీ హనుమాన్ టెంపుల్,రాయల్ ఫంక్షన్ హాల్ మెయిన్ రోడ్ మరియు ధన్వి ప్రాంతాలు. 11 కేవీ మిలిటరీ-1 ఫీడర్ పరిధిలోని రామ్‌దేవ్‌గూడ, నెక్నాంపూర్,వన్ మోర్ నగర్, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, డిఫెన్స్ కాలనీ. వినియోగదారులకు విజ్ఞప్తి:"రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లైన్ల పటిష్టత, ప్రజా భద్రత కొరకే ఈ అత్యవసర నిర్వహణ పనులు చేపడుతున్నాము. కావున పైన పేర్కొన్న కాలనీల వినియోగదారులు ఈ సమయాలను గమనించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు సత్వరమే పూర్తయ్యేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

### సమ్మె విరమిస్తున్నాం...
## యధావిధిగా పనులు
### జవహర్ నగర్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం



**జవహర్ నగర్, (సింగిడి):** సమ్మె విరమిస్తున్నాం యధావిధిగా పనులు కొనసాగుతాయని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. సెంట్రింగ్ మేస్త్రీల అహంకార వ్యాఖ్యలను నిరసిస్తూ బిఎన్ ఆర్ కె ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాపీ మేస్త్రీలు గత కొన్ని రోజులుగా చేస్తున్న సమ్మెను సోమవారం విరమిస్తున్నామని భవన నిర్మాణాంగాల కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో సెంట్రింగ్ తాపీ మేస్త్రీల బంధం విడదీయ రానిదని పేదలపై ఆర్థిక భారం మోపకుండా అడ్డగోలుగా రేట్లను పెంచడం తగదని అన్నారు. కార్మికుల సంక్షేమంపై పెద్ద ఎత్తున ఉద్యమించాలని పేర్కొన్నారు. తాపీ మేస్త్రీల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపిన ప్రజాప్రతినిధులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబు, రామన్న, రమేష్ చారి, కమలాకర్ ,జోగారావు, సంతోష్, వెంకటేష్, యాదయ్య, బూడిద వెంకటేష్, బాలు, చెన్నారెడ్డి, మధుసూదన్ రావు, కొండయ్య, రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడులను
## బలోపేతం చేద్దాం:ఎంఈఓ పాండు



**అమనగల్లు, (సింగిడి):** : నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆమనగల్లులో మండల విద్యాధికారి పాండు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ జయరామ్ విజయ్ పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి వసతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల నమోదును పెంచి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈఓ కోరారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ నమోదు చేయాలని ఆదేశించారు.

# అల్కాపూర్ రోడ్ నెం.30 తవ్వకాలపై విచారణ జరపాలి: బీఆర్ఎస్



**రాజేంద్రనగర్, (సింగిడి):** అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెం. 30 లో చేపట్టిన అశాస్త్రీయ తవ్వకాల వ్యవహారంపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం బీఆర్ఎస్ మణికొండ, నేక్నాంపూర్ డివిజన్ల నాయకులు అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రూ. 1.85 కోట్ల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనికి అనుమతి లభించగా, వర్క్ ఆర్డర్‌లో దీనిని వర్షపు నీటి కాలువ (స్టార్మ్ వాటర్ డ్రెయిన్)గా పేర్కొనడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంట్రాక్టర్ కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా లోతైన తవ్వకాలు జరపడం వల్ల పటిష్టంగా ఉన్న యూజీడీ, తాగునీటి పైపులు దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే వర్షపు నీటి కాలువల వ్యవస్థ ఉండగా, మళ్లీ కొత్తగా తవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నాయకులు అల్కాపూర్ రోడ్ నెం. 30 లోని జయశంకర్ పార్కును పరిశీలించారు. పార్కులో విద్యుత్ దీపాలు వెలగకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వాచ్‌మన్‌కు 4 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలి



### విద్యాశాఖ కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఈ నవీన్ నికోలాస్

**అల్వాల్, (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వపాఠశాలలు సోమవారం జూన్ 15న పునః ప్రారంభమయ్యాయి. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్.ఇ. నవీన్ నికోలస్, డిఇఓ. రేణుక దేవి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వము అన్ని విధాల వసతులను కల్పిస్తున్నదని నోట్ బుక్స్ స్కూల్ డ్రెస్సులు అందజేస్తున్నారని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలో ఎలాంటి విద్య అందజేస్తారో, దానికి దీటుగావిద్యని ప్రభుత్వ పాఠశాలలో కూడా బోధిస్తారని భరోసా కల్పించారు. మేరీ టీచర్ ప్రకటించిన ప్రోత్సాహక బహుమతులను. గత సంవత్సరం మంచి మార్కులు పొందిన విద్యార్థులకు నగదు బహుమతి డైరెక్టర్ చేతుల మీదుగా స్కూల్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో అల్వాల్ తాసిల్దార్ రాములు,ఏ ఎం ఓ వేణు, ఎంఈఓ మురళీకృష్ణ, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతల, సునీత,హారతి మేరీ, ఇందిరా, రమాదేవి,వెంకటయ్య, లక్ష్మణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# "కైలాశేశ్వరుడి" సేవలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజులరామారం డివిజన్ మాదేవపురంలోని కైలాష్ హిల్స్ లోని కైలాశేశ్వరుడిని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు సందేశ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు యాదయ్య, దేవాలయ చైర్మన్ వెంకటేశ్వర రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులు భాస్కర మూర్తి, వసంత బాబు, ప్యాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, మూసాఖాన్, ఇమ్రాన్ బేగ్, చెట్ల వెంకటేష్, తారా సింగ్, మసూద్, చిన్న చౌదరి, రాములు గౌడ్, దూలప్ప, నవీన్ దండుగుల, ప్రసాద్, శ్రవణ్, గౌస్, జునైద్, సయ్యద్ రంజాన్, భాస్కర్ ముదిరాజ్, రవికిరణ్ యాదవ్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


# నేషనల్ ఉమెన్ లీడర్షిప్ అవార్డుకు నరసవ్వ ఎంపిక




**దుబ్బాక, (సింగిడి):** సామాజిక సేవ, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, తెలంగాణ ఉద్యమంలో విశేష కృషి చేసిన ప్రముఖ మహిళా నాయకురాలు నెల్లుట్ల నరసవ్వ గ్రామము బక్రీ చెప్యాల బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించిన "నేషనల్ ఉమెన్ లీడర్షిప్ అవార్డు --2026"కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ గారు అధికారికంగా ప్రకటించి, అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో నరసవ్వ అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవ కులు, మహిళా నాయకులు, రచయితలు, కవులు మరియు స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఈ జాతీయ అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. బహుజన సాహిత్య అకాడమీ 19వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా జులై 12, 2026న హైదరాబాద్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. నెల్లుట్ల నరసవ్వ గారి సేవలను పరిశీలిస్తే, 1999 సంవత్సరంలో ఇందిరా కాంతి పథకం స్వయం సహాయక సంఘాల ఉద్యమంలో చేరి మహిళలను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2003లో ఐకేపీ మండల ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేశారు. గ్రామీణ మహిళల ఉపాధి అవకాశాల పెంపు కోసం వడ్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆమె పాత్ర విశేషమైనది. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో 1410 రోజుల పాటు నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని చాటిచెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం మహిళలను చైతన్యపరచడంలో ముందుండి పనిచేశారు. అంతేకాకుండా, 2015 సంవత్సరంలో రైతు సమన్వయ జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికై, రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి వ్యవసాయ రంగానికి సేవలందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. సామాజిక సేవా రంగంలో కూడా నరసవ్వ సేవలు ప్రశంసనీయమైనవి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాలకు అండగా నిలిచి అనేక కుటుంబాలకు ఆర్థిక, సామాజిక సహాయం అందించారు. పేద మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అదేవిధంగా గత ఐదు సంవత్సరాలుగా విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు కోసం కృషి చేశారు. బాలికల విద్య, పేద విద్యార్థుల ప్రోత్సాహం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళా నాయకత్వం, సామాజిక సేవ, రైతు సంక్షేమం, తెలంగాణ ఉద్యమంలో ఆమె చేసిన విశేష సేవలను గుర్తిస్తూ బహుజన సాహిత్య అకాడమీ ఈ ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు, గుర్రాల శ్రీనివాస్, కుంబాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. నెల్లుట్ల నరసవ్వ జాతీయ స్థాయిలో ఈ గౌరవం లభించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

# తహసీల్దార్‌కు స్వాగతం తెలిపిన తిమ్మాపూర్ సర్పంచ్



**దుబ్బాక, (సింగిడి):** దుబ్బాక మండలానికి నూతనంగా మండల రెవెన్యూ అధికారి తాసిల్దార్ (ఎమ్మార్వో)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ మోతి కితావాత్ గారిని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం కన్వీనర్ శ్రీ గుర్రాల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గ్రామానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలను ఎమ్మార్వో గారి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తిమ్మాపూర్ గ్రామంలోని ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. గ్రామానికి చెందిన సుమారు 792 మంది రైతులు ఈ కేంద్రం ద్వారా తమ ధాన్యాన్ని విక్రయిస్తున్నారని, అయితే కేంద్రం చుట్టూ సరైన హద్దులు లేకపోవడం వల్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రం పరిధిని సర్వే ద్వారా గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్వో గారికి వినతిపత్రం సమర్పించారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తాగునీరు, నీడ, రవాణా సౌకర్యాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీ మోతి కితావాత్ గారు స్పందిస్తూ, రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, జి పి ఓ స్వామి గ్రామ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కట్టుబడి ఉంటామని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ తెలిపారు.



# బేకరీ ప్రారంభించిన రావుల శేషగిరి

**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ మహాదేవపురం మహేష్ కుమారుడి జన్మదిన వేడుకలకు బిజెపి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరై చిరంజీవిని ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కైలాస్ హిల్స్ కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ది బ్యాక్ హౌస్ బేకరీ స్వీట్స్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, మురళీకృష్ణ, భాస్కర్, శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు
## పనిముట్లివ్వాలి:
### ఏఐటీయూసీ డిమాండ్



**రాజేంద్రనగర్, (సింగిడి):** జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్ మాట్లాడారు.సర్కిల్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా అధికారులు పనిముట్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికులే సొంత డబ్బులతో చీపుర్లు కొనుక్కుంటున్నారని, అధికారులు ఇచ్చిన అరకొర చీపుర్లు కూడా ముక్కిపోయి ఉన్నాయని ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభమైనా మోరీలు సాఫ్ చేయడానికి పారలు, ఇతర పనిముట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ధర్నా అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి. సురేందర్ రెడ్డి కి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై డీసీ స్పందిస్తూ.. వారం రోజుల్లో కార్మికులకు చీపుర్లు, అవసరమైన పనిముట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో హామీ నిలబెట్టుకోకుంటే విధులను బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం ముందే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు చెన్నయ్య, నర్సింగ్ రావు, అండాలు, నిర్మల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా బంద్

**ఆమనగల్లు, (సింగిడి):** అమనగల్లు మండల పరిధిలోని విఠాయిపల్లి , పరిసర ప్రాంతాల్లో రేపు (జూన్ 16న) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, లైన్ మెయింటెనెన్స్ పనుల దృష్ట్యా ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే ఎస్ఎల్వీ కాటన్ మిల్లు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది. కావున పట్టణ ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

### మైసిగండి మైసమ్మ సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి



**ఆమనగల్లు, (సింగిడి):** కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, పీబిసి సభ్యులు బాలాజి సింగ్,బ్లాక్ అధ్యక్షులు యాట నరసింహ,తదితర నాయకులు ఉన్నారు.

### స్కూల్ ప్రారంభం రోజే బుక్స్ పంపిణీ



**అల్వాల్, (సింగిడి):** తెలంగాణ లో జూన్ 15న పాఠశాలలు పునః ప్రారంభమైనవి. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఓల్డ్ ఆల్వాల్ లో విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శశిరేఖ, సూర్య కిరణ్, వీనస్ మేరీ ,విజయలక్ష్మి, అశోక్, జ్యోతి యాదవ్, ప్రధాన ఉపాధ్యాయులు సుశీల, అనిత, ప్రసన్న, వెంకటయ్య, పాల్గొన్నారు.

# ఉమ్మడి కార్యాచరణ దిశగా జవహర్‌నగర్ దమ్మాయిగూడ డంపింగ్ జేఏసీలు

**రాంకీ డంపింగ్ యార్డ్ తొలగించే లక్ష్యంగా జేఏసీల తీర్మానం**

**డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి, శంకర్ నారాయణలు**





**జవహర్‌నగర్, (సింగిడి):** జవహర్ నగర్ దమ్మాయిగూడ ప్రజలతో పాటు డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపే లక్ష్యంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ యాంటీ డంపింగ్ యార్డ్ దమ్మాయిగూడ జేఏసీ నేతల భవిష్యత్ కార్యాచరణకు అంగీకారం కుదిరిందని చైర్మన్ షేక్షావలి కన్వీనర్, డాక్టర్ శంకర్నారాయణ స్పష్టం చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ బి జె ఆర్ నగర్ నీలం రామచంద్రయ్య భవన్లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ అధ్యక్షతన కో కన్వీనర్స్ కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 16 లక్షల మంది ప్రజల వాయు కాలుష్యం, నీటి కాలుష్య వివిధ అనారోగ్య సమస్యతో పాటు పర్యావరణ ధ్వంసం పై దమ్మాయిగూడ జేఏసీ నేతలైన కన్వీనర్ శంకర్ నారాయణ కో కన్వీనర్ సమ్మిరెడ్డి సంజీవరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎక్కువేత పోరాట కమిటీ సమావేశం లో వివిధ అంశాలను చర్చించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 నుండి దమ్మైగూడ జేఏసీ తరఫున చేసిన న్యాయ పోరాటాన్ని వివరిస్తూ ప్రస్తుతం ప్రజల ప్రాణాలతో పాటు రాబోయే తరానికి మంచి గాలి నీరు పర్యావరణం అందించాల్సిన బాధ్యత బాధ్యత ప్రాంతాల్లో ప్రశ్నించి పోరాడే శక్తులతో పాటు కీసర శామీర్పేట యాప్రాల్ కాప్రా ఘట్కేసర్ దమ్మైగూడ మండలాల ప్రజలపై ఉందని తెలియజేశారు ప్రస్తుతం జవహర్ నగర్ జేఏసీ దమ్మాయిగూడ జేఏసీలు సమిష్టిగా డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు ఐక్యంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.

ఇకపై జవహర్ నగర్ జేఏసీతో దమ్మాయిగూడ జేఏసీ కలిసి పనిచేయడానికి తమ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణ: డంపింగ్ యార్డ్ లో ఉన్న తాజా చెత్తను బయోమైనింగ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, మురుగు నీటి ప్రవాహాన్ని తొలగించి, ప్రజలకు ఉచిత మంచినీటి వైద్య సౌకర్యాలు కల్పించాలని దుర్వాసనను అరికట్టాలని డంపింగ్ యార్డ్ మూసివేత వల్ల నగరంలో చెత్త సంక్షోభం రాకుండా ఉండేందుకు జిహెచ్ఎంసి తక్షణమే వికేంద్రీకరణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్రత్యామ్నాయ సైట్లను ఏర్పాటు చేసి ఎస్ డబ్ల్యూ ఎం రూల్స్ 2016 ప్రకారం మూసివేసిన తర్వాత కనీసం 15 సంవత్సరాల పాటు పోస్ట్ క్లోజర్ మానిటరింగ్ చేపట్టాలని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను రెండు సంస్థలతో త్వరలో మరొక సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు నరసింహ గౌడ్ ఎస్ కే మీరా పి శివ బాబు కో కన్వీనర్స్ గడ్డం సదానందం తోటపల్లి శంకర్ శివన్నారాయణ మేక లలిత యాదవ్ సుబ్రహ్మణ్యం గౌడుగు వేణు యక స్వామి, మహమ్మద్ భాషా మియా మల్లేష్ ప్రవీణ్ అనంతలక్ష్మి పెరక సునీత చంద్రన్న ప్రసాద్ మాధవరెడ్డి సయ్యద్ సత్యనారాయణ లక్ష్మీబాయి రాణి జె ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి




**ఉప్పల్, (సింగిడి):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మంగళవారం ఉప్పల్ ఎమ్మార్వో పుల్ సింగ్ మెమోరాండం మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జే వెంకన్న సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీమ్ లను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని సిఎస్ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని సహజ మరణానికి ఐదు లక్షలు పెంచాలని పెండింగ్ క్లైమ్సులు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన జీవో 12 రద్దు చేసి ప్రభుత్వమే హెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మిక సంక్షేమ పథకాలు అందించాలని 60 ఏళ్ళు నిండిన కార్మికులకు, 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక నాయకులు సిహెచ్ జంగయ్య, లాలు కృష్ణ, నరసింహ, రంగనాయకులు, వెంకటేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షుడిగా మహమ్మద్ అజీమ్ పాషా



**నాచారం, (సింగిడి):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎస్ ఎఫ్) ఉప్పల్ మండల అధ్యక్షుడిగా నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ కు చెందిన మహమ్మద్ అజీమ్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు ఏఐఎస్ఎఫ్ కు ఆకర్షితులై అజీమ్ పాషా అనేక విద్యా రంగ పోరాటాలలో పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో లోనే నిన్న జరిగిన మహాసభలో అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అజీమ్ పాష మాట్లాడుతూ ఉప్పల్ మండలంలో నెలకొన్న విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ కార్యదర్శి మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు కిరణ్, అరవింద్, అశ్రఫ్, కిరణ్, సహాయ కార్యదర్శులు సాజల్, ఇర్ఫాన్, అలీ, భరత్ లతో పాటు కౌన్సిల్ సభ్యులుగా ఉదీప్, బన్నే, సాయి, యోగి, అవినాష్, దీపక్, పవన్, ఆటిఫ్, షోయిబ్ లతో పాటు 20మందిని ఎన్నుకున్నారు.

## కన్నుల పండుగగా ప్రారంభమైన 2వ పుష్కర బ్రహ్మోత్సవాలు



**ఎల్బీనగర్, (సింగిడి):** గడ్డి అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 2వ పుష్కర బ్రహ్మోత్సవాలు మంగళవారం కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు 108 వెండీ కలిశాలతో అభిషేకం జరిగినట్లు తెలిపారు. సాయంత్రం ఆకురార్పణం, విశ్వక్సెన ఆరాధన రూత్వికవరణ నిర్వహించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారినీ దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పాల్థి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, ఊర నరసింహ గుప్తా, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, మార్గం రమేష్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు పనిచేయాలి

**టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి**



**ఎల్బీనగర్, (సింగిడి):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతగా పని చేయాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం రామకృష్ణాపురం డివిజన్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ల బూత్ లెవెల్ ఏజెంట్ల విధివిధానాలు, ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సులో దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేప మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, విధివిధానాలపై ఏజెంట్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూన్న గణేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, దుబ్బాక శేఖర్, మహమ్మద్, రామకృష్ణ గౌడ్, సుదర్శన్, రమేష్, నబీ, సైదులు ,పటేల్, శ్రవణ్, శ్రీధర్, జహంగీర్, రఫీ, రేణుక, రమాదేవి, కవిత, మంజుల, రజిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహం

- కళాశాలల బహిష్కరణకు విశేష స్పందన..
- కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో
- ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం:గుజ్జ సత్యం



**ఎల్బీనగర్, (సింగిడి):** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించు కోవాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు గుజ్జ సత్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగబద్ధమైన విద్యా అవకాశాలను కల్పించే సామాజిక న్యాయ పథకమని స్పష్టం చేశారు. వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకంపై ఆధారపడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికే కళాశాలలకు వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవ డంతో అనేక విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయా యని, మరోవైపు విద్యార్థులు ఫీజుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను హక్కుగా గుర్తించిన ప్రభుత్వం, అదే హక్కు అమలులో మాత్రం వెనుకడుగు వేయడం విరుద్ధమైన వైఖరినీ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం, విద్యార్థులపై ఆర్థిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకోవడం వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం కొనసాగుతుందని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, బీసీ కులాల సమన్వయ వేదిక బొమ్మ రఘురాం నేత, సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ సల్వా చారి, అశోక్ గంగపుత్ర , మహేష్ , రాజేష్, నరేందర్, విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గీతం విద్యార్థిని నివేదితకు గాంధీ ఫెలోషిప్



**పటాన్చెరు, (సింగిడి):** ప్రతిష్టాత్మక గాం నకు, గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఎం.ఏ. ఎకనామిక్స్ విద్యార్థిని ఆర్. నివేదిక ఎంపికైంది. ఈ విషయాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ వర్గాలు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించాయి. న్యూఢిల్లీలోని పిరమల్ ఫౌండేషన్ అందించే, జాతీయంగా గుర్తింపు పొందిన నాయకత్వ కార్యక్రమం ఇదని, సామాజిక పరివర్తనకు కట్టుబడి ఉన్న యువతలో మార్పును ప్రోత్సహిస్తుందని వివరించారు. గాంధీ ఫెలోషిప్ అనేది 23 నెలల పాటు సాగే ఒక పరివర్తనాత్మక నాయకత్వ ప్రయాణమన్నారు. ఇది యువ నాయకులను క్షేత్రస్థాయిలో పనిచేసేలా శక్తివంతం చేయడానికి, భారతదేశం అంతటా ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయడానికి దోహదపడేలా రూపొందించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమం నాయకత్వ అభివృద్ధి, వ్యక్తిగత ఎదుగుదల, సామాజిక ప్రభావాన్ని ఏకీకృతం చేసే ఒక ప్రత్యేక వేదికను అందిస్తుందన్నారు. ఇది ఫెలోలు సమాజానికి సేవ చేస్తూ, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరిస్తూ, లోతైన ఆత్మపరిశీలన పొందేందుకు వీలు కల్పిస్తుందని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ఫెలోషిప్ నకు నివేదిత ఎంపిక కావడం, సామాజిక మార్పు, సమాజ భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన నాయకత్వం పట్ల ఆమెకున్న అంకితభావాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆమె సాధించిన ఈ విజయం, గీతంలో పెంపొందించిన సానుభూతి, సేవ, శ్రేష్ఠత వంటి విలువలకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయం సాధించినందుకు విశ్వవిద్యాలయ నాయకత్వం నివేదితను అభినందించడమే గాక, ఆమె ఈ ఫెలోషిప్ ద్వారా అర్థవంతమైన సేవలు అందిస్తూ, సమర్థవంతమైన నాయకురాలిగా ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తపరిచినట్టు తెలియజేశా రు. అభ్యాసం, నాయకత్వం, సమాజ సేవతో కూడిన ఈ స్ఫూర్తిదాయకమైన ప్రయాణంలో నివేదిత మరిన్ని విజయాలు సాధించాలని గీతం నాయకత్వం ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సెక్యూరిటీ తగ్గించడం ప్రభుత్వ కుట్ర

- **మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ**



**సంగారెడ్డి ప్రతినిధి, (సింగిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి మరియు హోం మంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాజీ ఐపిఎస్ అధికారి, దళితుడైన డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (అడిషనల్ డిజిపి రిటైర్డ్) సెక్యూరిటీ తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని, ఆ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్ చేస్తుంది. బుధవారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నాలుగు రోజుల క్రితం చట్ట విరుద్ధంగా, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి స్పష్టమైన కారణాలు చూపకుండా పోలీసు అధికారులు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఫోన్ చేసి తన సెక్యూరిటీని తొలగిస్తున్నాం, బుల్లెట్ ప్రూఫ్ వాహనం తిరిగి ఇవ్వాల్సిందిగా ఆదేశాలు ఇవ్వడం ప్రభుత్వ కుట్ర అని మైస. ఉపేందర్ మాదిగ అన్నారు. ప్రస్తుతం డా. ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నందుకే తమ ప్రభుత్వం ఇలాంటి దిగజారుడు చర్యకు పాల్పడుతుందని తెలిపారు. డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 1995 లో ఐపిఎస్ అధికారిగా ఉద్యోగం సాధించి, 26 సంవత్సరాల పాటు సుదీర్ఘ కాలం, మన దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధమై తెగించి పని చేశారు. ఆయన పని చేసిన కాలంలో దేశానికి మరియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు ఎదురైనా ఎన్నో సవాళ్లను ఎదుర్కోవడానికి చాకచక్యంగా, వినూత్నమైన రీతిలో నియంత్రిస్తూ, తనదైన పద్ధతిలో పని చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో చట్ట వ్యతిరేక శక్తులు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను టార్గెట్ చేసుకొని, పలుమార్లు అతనిపై హత్యాయత్నాలు జరిపిన విషయం ప్రభుత్వానికి తెలుసని, అయిన డా.ప్రవీణ్ కుమార్ సెక్యూరిటీ తగ్గించడం దళితులను రాజకీయంగా అనగదొక్కడానికి జరుగుతున్న కుట్రగా భావిస్తున్నామని, డా,ఆర్, ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఏమి జరిగినా ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలు అగ్గిపుట్టిస్తారని హెచ్చరించారు.

## ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలి

**మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**



**కుత్బుల్లాపూర్, (సింగిడి):** ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ తెలిపారు. మంగళవారం మగ్దమ్ నగర్ లోని ఆయన నివాస కార్యాలయం వద్ద (జి ఎల్ ఆర్ ఏ ఇండియా) వారి ఆధ్వర్యంలో మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి డాక్టర్ల బృందం సమక్షంలో ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ వారికి, మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎక్కువ శాతం నిరుపేదల నివసించే ఇలాంటి బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం వలన ఎంతో మందికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, డాక్టర్ల బృందం మాట్లాడుతూ బిపి, షుగర్, టెస్టులతోపాటు వైరల్ ఫీవర్స్, దగ్గు జ్వరం, కీళ్ల నొప్పులు, గొంతు నొప్పి, తదితర రోగాలకు ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ డాక్టర్స్ బృందం. డాక్టర్ సంజయ్ కుమార్, సౌజన్య, స్నేహ, శివాని, నాయకులు మాజీ అధ్యక్షులు రుద్రా అశోక్, మల్లేష్ గౌడ్, కొలుకుల జైహింద్, వేణు యాదవ్, పాపిరెడ్డి, సిహెచ్ దాసు, ప్రభాకర్, హనుమంతు, విట్టల్ గౌడ్, రాయి రాజేష్, సునీల్ రెడ్డి, సంపత్ రెడ్డి, జై మల్లేష్, సబిత, ఉమారాణి, సతీష్ పాల్గొన్నారు.



# వాలంతరీలో పదవీ విరమణ సన్మానం



## 32 ఏళ్ల పాటు అంకితభావంతో సేవలు

**రాజేంద్రనగర్, (సింగిడి):** రాజేంద్రనగర్‌లోని వాలంతరీ సంస్థలో సుదీర్ఘ కాలంగా సేవలందించిన ఉమెన్ మజ్దూర్ ఉద్యోగినులు రాణి, యశోదల పదవీ విరమణ మహోత్సవం మంగళవారం కార్యాలయ ఆవరణలో అత్యంత ఘనంగా జరిగింది. సంస్థలో 32 సంవత్సరాల పాటు వారు అందించిన నిరంతర సేవలను గుర్తిస్తూ తోటి సిబ్బంది, అధికారులు వారిని ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాలంతరీ డైరెక్టర్ జనరల్ అనిత మాట్లాడుతూ.. రాణి, యశోదలు తమ విధి నిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ ఎందరికో ఆదర్శమన్నారు. మూడు దశాబ్దాలకు పైగా సంస్థ ఎదుగుదలలో వారు భాగస్వామ్యమయ్యారని గుర్తు చేశారు. ఉన్నతాధికారులతోనే కాకుండా, తోటి సిబ్బందితోనూ ఎంతో అన్యోన్యంగా ఉంటూ అందరి మన్ననలు పొందారని డీజీ కొనియాడారు. వారి సేవలు సంస్థకు ఎనలేనివని ప్రశంసించారు. అనంతరం పదవీ విరమణ చేసిన రాణి, యశోదలను డీజీ అనితతో పాటు అధికారులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలంతరీ ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

**ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు**
**మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి**
**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




**సంగారెడ్డి బ్యూరో, (సింగిడి):** జిల్లాలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎల్పీవోలు, డీపీఎంలు, ఎంపీడీ వోలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచా యతీరాజ్ ఈఈలు, డీఈలు, ఏఈలు తదితర అధికారులతో వివో భవనాలు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, పాఠశాల మరుగుదొడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌లు (జూజలు), వ్యక్తిగత గృహ మరుగు దొడ్లు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల కాంపౌండ్ వాల్స్, కల్వర్టులు, డ్రైనేజీ పనులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ భవనాలు, తాగు నీటి సరఫరా తదితర అంశాలపై మండలాల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, జిల్లాలో వివో భవనాల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు. కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ ల నిర్మాణ పనులను వేగవంతం చేయాల ని సూచించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత తాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా ఉండేలా స్ట్రీమ్‌లైన్ చేయాలని, మరుగుదొడ్లు అవసరమైన పాఠశాలలకు కొత్త టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించిన అంచనా ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన పాఠశాలల్లో కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర అత్యంత కీలకమని , మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో డివిజనల్ పంచాయతీ అధికారులు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి అభివృద్ధి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావే శంలో అదనపు కలెక్టర్ పాండు, డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, ఇన్‌చార్జి సీపీఓ జగదీష్, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రమణమూర్తిపై దాడిని ఖండిస్తూ నిరసన

**దాడికి పాల్పడ్డ కశ్యప్ రెడ్డిని తక్షణమే**
**అరెస్టు చేయాలని డిమాండ్**
**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహనీయుల**
**విగ్రహాల వద్ద ప్లకార్డులతో నిరసన**



**సంగారెడ్డి ప్రతినిధి (సింగిడి):** జై భారత్, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ ఉ ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం సంగారెడ్డిలో వివిధ సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాల వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, దుర్గాప్రసాద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్, బాబు జగ్జీవన్‌రామ్ సమతా సంఘం జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, స్వేరో జిల్లా నాయకుడు బి.బి. పేట్ రాజు మాట్లాడుతూ రమణమూర్తిపై దాడికి పాల్పడిన కశ్యప్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల బీఆర్‌కే టీవీ నిర్వహించిన ప్రత్యక్ష చర్చా కార్యక్రమంలో రమణమూర్తి చర్చకు సంబంధించిన అంశాలపై కొన్ని చిత్రాలను చూపిస్తూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారని, వాటికి సమాధానం చెప్పకుండా భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. హిందూ--ముస్లిం మత సామరస్యానికి కృషి చేస్తూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రమణమూర్తిని సైద్ధాంతికంగా ఎదుర్కోలేకే కుట్రపూరితంగా ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అభిప్రాయ భేదాలను హింసతో ఎదుర్కోవడం సమాజానికి మంచిది కాదని, ఇటువంటి దాడులను ప్రజాస్వామ్యవా దులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనజాగృతి సేన జిల్లా అధ్యక్షులు బంగారు కృష్ణ, బీసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దేవదాస్, సామాజిక ఉద్యమ నాయకులు బసవరాజ్ అనిల్, బౌద్ధ, కెవిపీఎస్ జిల్లా అధ్యక్షులు శివకుమార్, జై భారత్ జిల్లా నాయకులు డప్పు ప్రభాకర్, మచ్చూరి ప్రసాద్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు పోరాటంలో.. బాగస్వాములు అవ్వండి

**న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు..**
**జే.వి.చలపతిరావు**





**జవహర్ నగర్, (సింగిడి)** జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపుకై జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ బాగస్వాములు కావాలని న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెవి. చలపతిరావు పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ కార్మిక నగర్లో గురువారం సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి.చలపతిరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన, సంక్షేమం జవహర్ నగర్ డంపింగ్ బాధిత ప్రాంతాల ప్రజలకు వర్తించదా? తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇక్కడి ప్రాంత ప్రజల ప్రయోజనాలకంటే, వారి ప్రాణాలను తీస్తున్న బడా బాబుల కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు పాటుపడడం సిగ్గుచేటయిన విషయం అని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం డంపింగ్ యార్డు తొలగింపుకు చర్యలు చేపట్టి, రాంకీ యాజమాన్యం ప్రజలపై చేపడుతున్న అన్నిరకాల బెదిరింపులు, కక్ష పూరితమైన చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాటకమిటీ సలహాదారులు, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కార్మికనగర్ దామల ప్రబాకర్ రావు, వాసంశెట్టి శ్రీనివాస్ రావు, నర్సాపురం క్రిష్ణ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్, టియుసిఐ వి.ప్రవీణ్, జి.నరహరి, పప్పుల మల్యార్, సిపిఎం శ్రీనివాస్ మరియు పోరాటకమిటి కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు మాజీ ఉపసర్పంచ్, కమిటీ సలహాదారుడు ఆర్. నర్సింహ్మాగౌడ్, కో కన్వీనర్స్ సీపీఐ శంకర్, సిపిఎం శివన్నారాయణ, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత, టిజేఎస్ బద్రగామ అంజినేయులు, బి.ఎన్.ఇర్.కె.ఎస్.సూర వెంకన్న, మేడ్చల్ కాంగ్రెస్ దండ్ల మురళి, టియుజేఏసి కల్లెపు చంద్రన్న పిడిఎం చంద్రమౌళి, రవిచారి, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీబాయి, అల్లూరి సావిత్రి, సిపిఎం టి.శివన్నారాయణ, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, సిఎంఎస్ జయ, పికెఎం డి.జాన్, న్యూడెమోక్రసీ అనురాధ, పి.డి.ఎస్.యు. మహేష్, గౌతమ్, తెలంగాణ ప్రజానాట్యమండలి ఎ.ప్రవీణ్, కళాకారులు వెంకటాచారి, తుమ్మరాణి, ఆవుల క్రిష్ణ, బాస్కర్ చారి, రామతార, టివైఎస్ కర్రె సత్యనారాయణ, వి.నాగేష్, టి.యు.వి. ప్రతాప్ జర్ర, భారతి, జి.సరిత తదితరులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న ఉద్యమ గేయాలు డంపింగ్ యార్డుపై కళాకారులు ఆలపించిన ఉద్యమగీతాలు జవహర్ నగర్ ప్రాంతంలోని వివిధ కాలనీలను, కార్మికనగర్ వాసులను ఆకట్టుకున్నాయి.

# అధ్యాపకులేరీ-రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు



**కొడంగల్, (సింగిడి):** దుద్యాల మండల కేంద్రంలోని హకింపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.అనిల్ అన్నారు. గురువారం హకింపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన జూనియర్ కళాశాలను మంజూరు చేసి కళాశాలను ప్రారంభించారన్నారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎం ఎల్ టి, ఎం పి హెచ్ డబ్ల్యు గ్రూప్‌లలో 150 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. అధ్యాపకులు లేకపోవడంతో చదువు ముందుకు సాగక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల చదువు ముందుకు కొనసాగాలంటే అధ్యాపకులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నియోజకవర్గంలో విద్యార్థులు అధ్యాపకుల కొరత ఉందని రోడ్డు ఎక్కడం విచారకరమన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ చేస్తామని చెప్పి ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి అన్ని విద్యాసంస్థలు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుండి విద్యార్థులు కొడంగల్ కు వచ్చి చదువుకునే విధంగా చేస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేకపోవడం చూస్తుంటే ఏ స్థాయిలో విద్యార్థులపై ప్రభుత్వానికి ప్రేమ ఉందో అ-ర్థం అవుతుందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి చంద్రయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి




## ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్

**వికారాబాద్, (సింగిడి):** కేసుల ఛేదనలో శాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్ కు గురువారం దిశా నిర్దేశం చేశారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు సీ డీ ఆర్,ఐడి పి ఆర్ టవర్ డంప్ అనాలిసిస్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఎక్స్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లు, హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల దర్యాప్తు, పెండింగ్ కేసుల ఛేదన అంశాలపై నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతున్నందున సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన ప్రతి దర్యాప్తు అధికారికి అత్యంత అవసరమని తెలిపారు. నేరస్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సీ డీ ఆర్, ఐ పి ఆడీ ఆర్ టవర్ డంప్ డేటా విశ్లేషణతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో, హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా సమర్థవంతమైన శోధన ద్వారా కీలక ఆధారాలను సేకరించి కేసులను త్వరితగతిన ఛేదించవచ్చని సూచించారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సాంకేతిక ఆధారాలను వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి కేసులో డిజిటల్ సాక్ష్యాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడం, పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కనుగొనడం, మోసాలు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో డిజిటల్ ఇంటెలిజెన్స్ ను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ప్రతి దర్యాప్తు అధికారికి సహాయకంగా ప్రతి క్రైమ్ స్టాఫ్ సిబ్బంది ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ గారు, ఐటి సెల్ ఎస్ఐ శంకర్,ఐటి సెల్ సిబ్బంది, జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన డీసీసీ ఉపాధ్యక్షులకు నియామక పత్రం అందజేసిన కొలను హనుమంత రెడ్డి.

**కుత్బుల్లాపూర్, (సింగిడి):** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ ను మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) డీసీసీ ఉపాధ్యక్షునిగా నియమిం చారు. ఈ సందర్భంగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతరెడ్డి ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ ను శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతూ నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తోందని అన్నారు. ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, సంస్థాగత బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**పటాన్చెరు, (సింగిడి):** పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) గురువారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తిరుమలలో భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్ అనంతరం ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులువేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో ఆనందం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, అభివృద్ధి చేకూరాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు గూడెం సందీప్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సోమ శీనయ్య, సుధాకర్ గౌడ్, స్వామి వారిని దర్శించుకున్నారు.

# తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలి

**చట్టబద్ధంగా యూనియన్ పెట్టుకుంటే కార్మికులను**
**ఉద్యోగాల నుండి ఎలా తొలగిస్తారు**
**చట్టాలు, రాజ్యాంగం అంటే బిస్లరీ యాజమాన్యం కు గౌరవం లేదా**
**సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్**
**కండ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని న్యాయం చేయాలంటూ**
**బిస్లరి కార్మికుల వినూత్న ఆందోళన**



**పటాన్చెరు, (సింగిడి):** తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని, చట్టబద్ధం గా యూనియన్ పెట్టుకుంటే కార్మికుల ను ఉద్యోగాల నుండి ఎలా తొలగిస్తారని ..? సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, బిస్లరీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు. పటాన్చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (బిస్లరీ వాటర్) పరిశ్రమ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం 36 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈరోజు పరిశ్రమ వద్ద న్యాయం కావాలంటూ బిస్లరీ కార్మికులు కండ్లకు నల్ల రిబ్బన్ కట్టుకొని వినూత్నంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ 2025 అక్టోబర్ నెలలో బిస్లరి పరిశ్రమల్లో కార్మికులు చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నారని దీనిని సహించలేని యాజమాన్యం కక్షతో యూనియన్ జనరల్ సెక్రెటరీ తో సహా ఐదు మంది ఆఫీస్ బేరర్స్‌ను తొలగించిందని అన్నారు. చట్టబద్ధంగా యూనియన్ పెట్టుకుంటే తొలగిస్తారని ప్రశ్నించారు. 9 నెలల నుండి కార్మికులకు కంపెనీ యాజమాన్యం జీతాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు. రోడ్డున పడ్డాయని అన్నారు. ఐదు మంది కార్మికులను యాజమాన్యం డిస్మిస్ చేయడంతో కార్మికులు అందరూ అనివార్యంగా సమ్మె చేయవలసి వచ్చిందని అన్నారు. 36 రోజులుగా కార్మికులు ఐక్యంగా సమ్మె చేస్తుంటే యాజమాన్యం స్పందించక పోవడం దారుణం అని అన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని అన్నారు. చట్టాలు రాజ్యాంగం అంటే బిస్లరీ యాజమాన్యానికి గౌరవం లేదా అని ప్రశ్నించారు.. తొలగించిన కార్మికులను తిరిగి తీసుకోవాలని, యూనియన్ ను గుర్తించి వేతనం ఒప్పందం చేయాలని పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో "చలో ఐడిఏ పాశమైలారం" కార్యక్రమం చేపట్టి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.. యాజమాన్యం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి కార్మికులందరినీ వెంటనే విధిలోకి తీసుకొని సమ్మెను విరమింపజేసి న్యాయం చేయాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజు బిస్లరీ యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి నాయకులు నాగరాజు నవీన్ అజయ్ ప్రవీణ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వారాహి మాతగా.. శ్రీ పోచమ్మ తల్లి స్వరూపం

**శ్రీరామ్ నగర్లో ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు**
**మాజీ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్**






**జవహర్ నగర్, (సింగిడి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ శ్రీరామ్ నగర్ కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వారాహి నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలి రోజున అమ్మవారు శ్రీ వారాహి దేవి అలంకరణతో భక్తులకు దివ్యంగా దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉత్సవాల తొలి రోజున అమ్మవారు శ్రీ వారాహి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనమిస్తున్నారని ఆ అమ్మవారి దయవల్ల జవహర్ నగర్ ప్రజలే కాక జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నట్టు తెలిపారు. అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీ పోచమ్మ తల్లేనని, ఈరోజు నుండి అమ్మవారు వారాహి దేవి అలంకరణలో దర్శనమిస్తున్నారని కావున భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి 20న ధర్నా


**ఆమనగల్లులో కరపత్రాల విడుదల.. విజయవంతం చేయాలని పిలుపు**



**ఆమనగల్లు, (సింగిడి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను నిర్లక్ష్యం చేస్తూ వారి సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపిస్తూ ఈనెల 20న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును బలోపేతం చేసి, కార్మికుల సంక్షేమ నిధులను పారదర్శకంగా వినియోగించాలని, కార్మికులపై విధించిన వెల్ఫేర్ సెస్‌ను రూ. 12 నుంచి రూ. 54కు పెంచిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రమాద మరణ పరిహారాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ. 6 వేల పెన్షన్, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్‌లు, గృహ వసతి, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని, వెల్ఫేర్ బోర్డులో ఉన్న రూ. 13 వేల కోట్ల నిధులను పూర్తిగా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని, ఇసుక లేని పరిస్థితుల్లో ఉపాధి కోల్పోతున్న నిర్మాణ కార్మికులకు వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించాలని, అర్హులైన ప్రతి నిర్మాణ కార్మికుడికి 15 రోజుల్లోగా లేబర్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్, మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, మాజీ అధ్యక్షులు దూసకంటి యాదయ్య, మాజీ కార్యదర్శి నాగిళ్ల యాదయ్య, ముఖ్య సలహాదారుడు ముక్కరి కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు పులికంటి మైసయ్య, మారేపల్లి జంగయ్య, మీసాల లక్ష్మయ్య, మైసయ్య, జంతుక జానయ్య తదితరులు ఉన్నారు.

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఎస్.వి. నూకరాజుకు పీహెచ్.డీ



**పటాన్చెరు, (సింగిడి) :** దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి శ్రీధరాల వి. నూకరాజును డాక్టరేట్ వరించింది. 'దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం, వాహకం ద్వారా పనిచేసే వినూత్నమైన స్థానిక (టాపికల్) టెరిఫ్లునోమైడ్ ఔషధ రూపాల అభివృద్ధి' అనే శీర్షికతో ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ పవన్ కుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ నూకరాజు పరిశోధన, దైహిక దుష్ప్రభావాలను కనిష్ట స్థాయికి తగ్గిస్తూ, ఔషధాన్ని నేరుగా ప్రభావిత ప్రాంతానికి చేరవేసే లక్ష్యంతో, రుమటాయిడ్ ఆర్థరైటిస్, అటోపిక్ డెర్మటైటిస్ చికిత్స కోసం టెరిఫ్లునోమైడ్ యొక్క వినూత్న స్థానిక ఫార్ములేషన్లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిందని తెలియజేశారు. ఈ అధ్యయనం, ఆశాజనకమైన చికిత్సా పనితీరుతో, సురక్షితమైన, లక్షిత, రోగికి అనుకూలమైన చికిత్సా పద్ధతులను అందిస్తూ, వ్యాధి-నిర్దిష్ట స్థానిక ఫార్ములేషన్లను విజయవంతంగా అభివృద్ధి చేసిందన్నారు. ఈ పరిశోధన భవిష్యత్ క్లినికల్ అభివృద్ధి, వాణిజ్యీకరణకు బలమైన సామర్థ్యాన్ని కూడా ప్రదర్శిస్తోందని, తద్వారా స్థానిక ఔషధ పంపిణీ పరిశోధనకు ఒక ముఖ్యమైన తోడ్పాటును అందిస్తుందని వివరించారు. డాక్టర్ నూకరాజు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శివకుమార్, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# బిఆర్ఎస్ హయాం లోనే.. బిజేఆర్ నగర్ ప్రగతి పదంలోకి దూసుకెళ్లింది

**ప్రజాస్వామ్యంలో అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించాలి**
**సర్ డిజిటలైజేషన్ లో అప్రమత్తంగా ఉండాలి**
**జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ పల్లపు రవి**



**జవహర్ నగర్, (సింగిడి) :** బిఆర్ఎస్ హయాంలోనే... బీజేఆర్ నగర్ ప్రగతి పదంలోకి దూసుకెళ్లిందని ప్రజాస్వామ్యంలో అర్హులైన పౌరులకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూనే ప్రశ్నించే తత్వం పెరుగుతోందని మాజీ కార్పొరేటర్ పల్లపు రవి అన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను పురస్కరించుకొని జవహర్ నగర్ డివిజన్ బి జె ఆర్ నగర్ మల్లికార్జున్ నగర్ లో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు సెంటర్ ను గురువారం మాజీ కార్పొరేటర్ వల్లపు రవి బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో బిఆర్ఎస్ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఓటర్ ఫారం ప్రతి ఒక్కరికి అందించాలని ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా బిఎల్వోలు బిఎల్ఎలు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బీజేఆర్ నగర్ కాలనీ పేదల ఇళ్లకు 58 ,59వ జీవో ద్వారా పట్టాలు రిజిస్ట్రేషన్ అయ్యాయని గుర్తు చేశారు .30 ఏళ్ల నాటి నుండి మట్టి రోడ్డుకే పరిమితమైన బిజెపి నగర్ బిఆర్ఎస్ హయాంలో ప్రతి కాలనీలో డ్రైనేజీ సిసి రోడ్లుతో అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ రవి, అహ్మద్, ఆనంద్, మురళీకృష్ణ, రమేష్, చంద్రమౌళి, వేణు, ధనలక్ష్మి ప్రశాంత్, కళావతి, జనలక్ష్మి, బి ఎల్ వోలు, అనురాధ, స్వాతి, సుజాత, మనిషా తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహించిన డిప్యూటీ కమిషనర్



**కుత్బుల్లాపూర్, (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన కార్యక్రమంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, సోమేష్ యాదవ్, కిషోర్ చారి, సత్తి రెడ్డి, వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించడంతో పాటు ప్రతి అర్హుడైన ఓటరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ షాపుల వేలం బాధితులకు ఊరట

**శనివారం నుండి రిజిస్ట్రేషన్లు ప్రారంభం**
**హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో మాట్లాడి ఒప్పించిన**
**కాంగ్రెస్ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి**



**రామచంద్రాపురం, (సింగిడి) :** రామచంద్రపురం మండల పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలోని దుకాణాలను (షాపులను) బహిరంగ వేలం పాటలో దక్కించుకున్న లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడింది. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఈ షాపుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ విషయమై ఆయన గురువారం సంగారెడ్డి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ సి. హెచ్. చలపతి తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వేలం పాటలో షాపులు కొనుగోలు చేసి, నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించినప్పటికీ రిజిస్ట్రేషన్లలో జరుగుతున్న ఆలస్యం వల్ల వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పీడీ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, సమస్య తీవ్రతను వివరించిన ప్రభాకర్ రెడ్డి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ నాయకుడి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రాజెక్ట్ డైరెక్టర్, వచ్చే శనివారం నుంచే (జూలై 18) రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారికంగా ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తెల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... "కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్స్ పరిధిలోని దుకాణాలను వేలంలో పాడుకున్న వ్యాపారులు ఎంతో కాలంగా రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. డబ్బులు కట్టినా ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సానుకూలంగా స్పందించిన అధికారులు శనివారం నుంచే రిజిస్ట్రేషన్లు చేయడానికి అంగీకరించారు." అని తెలిపారు. మరియు ఆయన మాట్లాడుతూ... "ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది. కొల్లూరు పరిధిలోని వ్యాపారాలు త్వరగా ప్రారంభమైతే స్థానిక నివాసితులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. నిబంధనల ప్రకారం వేలం పాడుకున్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా, లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ తరపున తాము దగ్గరుండి చూసుకుంటాం" అని భరోసా ఇచ్చారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన చిలకమర్రి ప్రభాకర్ రెడ్డికి వేలం పాటదారులు మరియు స్థానిక నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహించాలి

**ప్రతి ఓటును కాపాడుకోవాలి**
**బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపు**



**అల్వాల్, (సింగిడి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహించి అర్హులైన ప్రతి ఓటు హక్కును పరిరక్షించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం వెంకటాపురం, భూదేవి నగర్, ఖనాజీగూడ డివిజన్ల బీఆర్ఎస్ బీఎల్ఏలతో శుభశ్రీ గార్డెన్‌లో, ఖనాజీగూడ డివిజన్‌లోని శ్రీ సత్యసాయి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక అవగాహన, సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సర్ కార్యక్రమం అమలు తీరును ఎమ్మెల్యే క్షుణ్ణంగా సమీక్షించి, క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 2002 ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల నమోదు విధానం, ఒకే కుటుంబంలో కొంతమంది సభ్యుల పేర్లు మాత్రమే ఉండి మిగిలిన వారి పేర్లు జాబితాలో లేకపోతే అనుసరించాల్సిన విధానం, ఈసీఐ ఎన్ఈటి పోర్టల్‌లో బూత్ నంబర్ నమోదు చేసినప్పుడు వేరే బూత్ వివరాలు చూపిస్తున్న సాంకేతిక సమస్యలు, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నప్పటికీ కొందరికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు అందకపోవడం, వృద్ధులకు ఫారమ్‌లు అందక ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు వంటి అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, మరణించిన వారు లేదా డబుల్ నమోదైన ఓటర్ల పేర్ల తొలగింపుకు ఫారం-7, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం-8 వినియోగంపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. బీఎల్ఏలు ప్రస్తావించిన సమస్యలను వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్ కార్యక్రమానికి ఆగస్టు 3 వరకు మాత్రమే గడువు మిగిలి ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈలోపు ప్రతి ఇంటికి చేరుకుని ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ పూర్తి చేయాలని, కొత్త ఓటర్ల నమోదు, షిఫ్టింగ్ అయిన వారి వివరాల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి బాధ్యతతో సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశాల్లో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్ ఎస్ నాయకులు నేమూరి శ్రీధర్ గౌడ్, తోట నరేందర్ రెడ్డి, జేఏసీ వెంకన్న, సురేందర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, అరవింద్, సంపత్, సయ్యద్ మోసిన్, తాజుద్దీన్, వీరేశం, రాజేష్ గౌడ్, ముత్యాలు, సెంథిల్, సంజీవ, ప్రేమ్, యాదగిరి, సతీష్, ప్రభాకర్, జనార్ధన్, శంకర్, రాజు, రామానుజన్, దేవేందర్, అనిల్, సాయి, సోమయ్య, సురేష్ రెడ్డి, కన్న, వీణ, అమృత, జ్యోతి, ఆశా, సరిత, శ్రావణి, రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల రుణాలతో రైతులు భరోసా రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



**వికారాబాద్, (సింగిడి) :** జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆధ్వర్యంలో పరిగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు సుమారు రూ. 45 లక్షల 60 వేల విలువైన బంగారు ఆభరణాల పై, దీర్ఘకాలిక రుణాల చెక్కులను గురువారం పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ డ్రోన్ సేవలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని, డ్రోన్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా రుణాలు అందించడం ద్వారా వారి వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా బలాన్నిచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మై హోమ్ అవతార్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**
**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థన**



**రాజేంద్రనగర్ , (సింగిడి) :** నార్సింగి సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ గేటెడ్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే.. ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులతో కలిసి రథోత్సవంలో పాల్గొని జగన్నాథుడికి భక్తి పూర్వకంగా ప్రణామం చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ జగన్నాథ స్వామి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. "రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని.. వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. ఈ రథయాత్ర మహోత్సవంలో మై హోమ్ అవతార్ నివాసితులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. హరినామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలో చేరిన బంజారా నాయకుడు నేనావత్ శంకర్ నాయక్

**కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించిన**
**రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**సంగారెడ్డి ప్రతినిధి (సింగిడి) ::** ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్టీ విభాగం చైర్మన్, మాజీ ఎంపీటీసీ, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కో-కన్వీనర్, ప్రముఖ బంజారా నాయకుడు నేనావత్ శంకర్ నాయక్ ఈరోజు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి శంకర్ నాయక్‌ను రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల సాధన, గిరిజనులు, బంజారా సమాజ అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేనను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని శంకర్ నాయక్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రజల మధ్య తెలంగాణ రక్షణ సేనను విస్తరించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కవిత పిలుపునిచ్చారు. శంకర్ నాయక్ వంటి అనుభవజ్ఞుడైన బంజారా నాయకుడి చేరికతో సంగారెడ్డి జిల్లాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ రక్షణ సేన మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, రవిచంద్ర, నెమలికొండ వేణుమాధవ్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ బాలయ్య, దయాకర్ రెడ్డి, మల్లశెట్టితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శంకర్ నాయక్‌కు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తి

**ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, (సింగిడి) :** పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందని ఎల్ బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కు చెందిన మంజుల వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దానికి గాను రూ.2 లక్షల ఎల్.ఓ.సీ. మంజూరు కాగా, ఆ చెక్కును బాధిత అన్న రాజు కి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ అక్క ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మా అక్క చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, యాదశంకర్, ముద్ద కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వానలు కురవాలని కప్పకావడి



**కొడంగల్, (సింగిడి) :** తొలకరి ప్రారంభమై మాసం గడిచినప్పటికీ వర్షం కురవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వాన రాకకై అన్నధాతలు ఎదురుచూస్తున్నారు. ప్రాచీన కాలపు ఆనవాయితీగా కప్ప,వేపాకులు, కావడి తీసుకుని వచ్చి కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసూదన్ ల స్వగృహంలో కప్పకావడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ, పురాతన కాలంలో వర్షాలు కురవక పోతే కప్పకావడి కార్యక్రమం ఊరూరా చేసేదని, వానదేవుడిని స్తుతిస్తూ పాటలు పాడేదని,తన చిన్న వయసులో ఇలాంటి కార్యక్రమాలు చాలా జరిగేవని, అది గుర్తుకు చేసుకుని మళ్ళీ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. వర్షాలు కురిస్తేనే పంటలు బాగా పండుతాయని, అన్ని జీవరాశులకు తాగునీరు, ఆహారం, ప్రాణవాయువు దొరుకుతుంది అని అన్నారు. ఈకార్యక్రమంలో మిఠాయి రాజేందర్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి డివిజన్‌లలో**

# "సర్" హెల్ప్ డెస్క్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి




**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286 కుత్బుల్లాపూర్ డివిజన్‌లో, 294 బహదూంపల్లి డివిజన్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్లో ఏర్పాటు చేసిన "సర్" హెల్ప్ డెస్క్ కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ "సర్" కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై ఏసీపీ ఆకస్మిక దాడులు



**ఎల్బీనగర్, (సింగిడి) :** విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య స్వయంగా ఎన్‌టీఆర్ నగర్‌లోని బెల్ట్ షాపులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులను తనిఖీ చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, బెల్ట్ షాపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు.

# అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి**

**కీసర, (సింగిడి) :** ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, రైతు సహకార సంఘాలను రాజకీయ నిరుద్యోగుల పునరావాస కేంద్రాలుగా మార్చే కుట్ర చేస్తుందని నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. పీఏసీఎస్ లలో పదవులను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తున్న అంశంపై నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బీజేపీ పంచాయతీ రాజ్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ సురేష్, నాగారం డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కీసర డివిజన్ అధ్యక్షుడు బాలరాజు యాదవ్ లు ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు.. ఇందులో భాగంగా పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతులకు తక్కువ వడ్డీపై పంట రుణాలు అందించడం, పంటల కొనుగోలు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరా, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే ఈ సంఘాలు రైతు ప్రయోజనాల పరిరక్షణకు ప్రతీకలని, అలాంటి సంస్థలను కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ నిరుద్యోగులకు ఆశ్రయ కేంద్రాలుగా మార్చాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంపూర్ణ రుణమాఫీ హామీ నేటికీ అమలు కాలేదని, రైతు భరోసా పథకాన్ని పలుమార్లు వాయిదా వేసిందని, పంటలకు బోనస్ విషయంలో కూడా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులకు పదవులు కట్టబెట్టడంలో మాత్రం అసాధారణ వేగం ప్రదర్శించడం ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయని అన్నారు. రైతు సహకార సంఘాల నియామకాల అంశంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నప్పటికీ, న్యాయ ప్రక్రియను సైతం పక్కనబెట్టి తొందరపాటుగా ముందుకు సాగడం ప్రభుత్వ అసలు ఉద్దేశాన్ని బయటపెడుతోంది ప్రజల ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలు, సొంత వర్గాల రాజకీయ పునరావాసమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. - రైతుల ఆత్మగౌరవాన్ని, సహకార సంఘాల స్వతంత్రతను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ భారతీయ జనతా పార్టీ సహించదని, రైతుల పక్షాన అన్ని స్థాయిల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఆగస్ట్ 15న రానున్న
# హుషారు పిట్టలు




అన్ను, వాసవి గణెళిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు.

ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్. ఎస్. చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది' అన్నారు.






మూడేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా

## నన్ను ధైర్యంగా నిలబెట్టింది
# నా భార్యనే: అఖిల్

మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే





ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు.


చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు.

నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.



# జననాయగన్ రిలీజ్... పోస్టర్ విడుదల





తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. ఈ ఏడాది సంక్రాంతికే థియేటర్లలో విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ చిత్రాన్ని ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ మేరకు ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. 'అగ్ని పరీక్షలో నిలిచి.. కాలం మలిచిన రూపం.. పోరాటం ఎంత కఠినంగా ఉంటే.. విజయం అంత ఘనంగా ఉంటుంది' అనే వ్యాఖ్యల్ని జోడించింది. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలకపాత్రలో నటించింది.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్.. మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్టను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.



## ప్రభాస్ ఫౌజీ డిసెంబర్ 3న లాక్
### రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల

ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది.




Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737